Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు
# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు
rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 153 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)
గురువారం, 22 - 1 - 2026
94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

# దమ్ముంటే చర్చకు రా..
## - ఏబీ వెంకటేశ్వరరావుకు జనసేన నేత బొలిశెట్టి సవాల్!



**అమరావతి, (రాజధాని వార్తలు):** అమరావతి రాజధాని అంశం మరోసారి రాజకీయ వేడిని రాజేస్తోంది. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు, జనసేన నేత బొలిశెట్టి సత్యనారాయణ మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. ఆరోపణలు, ప్రత్యారోపణలతో ప్రారంభమైన ఈ వివాదం, చివరికి బహిరంగ చర్చకు రావాలంటూ సవాళ్లు విసురుకునే వరకు వెళ్లింది.

**ఏబీ వెంకటేశ్వరరావు ఆరోపణలు ఇవే..**

ఇటీవల వైసీపీ అధినేత జగన్ అమరావతిపై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఏబీ వెంకటేశ్వరరావు స్పందిస్తూ, రాజధాని నిర్మాణంలో జాప్యానికి గల కారణాలను వివరించారు. "అమరావతికి పర్యావరణ అనుమతులు రాకుండా అడ్డుకునేందుకు చాలా పిటిషన్లు వేశారు. అందులో బొలిశెట్టి సత్యనారాయణ కూడా ఒకరు. ఆ పెద్దాయనతో సుప్రీంకోర్టు వరకు కేసులు వేయించి, పనులను మూడేళ్లపాటు సాగదీశారు. దీనివల్లే నిర్మాణం పూర్తి కాలేదు. ఇప్పుడు మేం నిజాలు చెబుతాం, అబద్ధాలను ఖండిస్తాం" అంటూ ఏబీ వ్యాఖ్యానించారు.

**బొలిశెట్టి తీవ్ర స్పందన**

ఏబీ వెంకటేశ్వరరావు ఆరోపణలపై జనసేన నేత బొలిశెట్టి సత్యనారాయణ తీవ్రంగా స్పందించారు. ఆయన వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమని, అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాను అమరావతి రాజధానికి, రైతులకు ఎల్లప్పుడూ మద్దతుగా నిలిచానని గుర్తుచేశారు. తాను వేసిన కేసులు కేవలం అమరావతిలోని జరీబు భూములు, వరద ముంపు ప్రాంతాలు, పర్యావరణ పరిరక్షణ కోసం మాత్రమేనని, రాజధాని నిర్మాణాన్ని అడ్డుకోవడానికి కాదని స్పష్టం చేశారు. "వైసీపీ పాలనలో ఏబీ వెంకటేశ్వరరావు కలుగులో దాక్కున్నప్పుడు, నేను జగన్ ప్రభుత్వ అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడాను. అలాంటి నన్ను జగన్ మనిషి అనడం హాస్యాస్పదం. సంస్కారం లేకుండా తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలి" అని బొలిశెట్టి హితవు పలికారు.

**బహిరంగ చర్చకు రావాలని సవాల్**

ఏబీ వెంకటేశ్వరరావు తనపై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని బొలిశెట్టి డిమాండ్ చేశారు. "దమ్ముంటే, నా ఆరోపణలపై మీడియా సమక్షంలో బహిరంగ చర్చకు రావాలి. సమయం, వేదిక మీరే నిర్ణయించండి" అంటూ ఎక్స్ వేదికగా సవాల్ విసిరారు.

# దావోస్‌లో వివిధ పారిశ్రామికవేత్తలతో
# కొనసాగుతున్న సీఎం చంద్రబాబు వరుస భేటీలు






**అమరావతి, (రాజధాని వార్తలు):** ముఖ్యమంత్రి చంద్రబాబుతో అర్సెల్లార్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ లక్ష్మీ మిట్టల్ భేటీ. దావోస్‌లోని ఏపీ లాంజ్ లో సీఎంతో జరిగిన భేటీలో పాల్గొన్న ఆ కంపెనీ సీఈవో ఆదిత్య మిట్టల్, మంత్రులు లోకేష్, టీజీ భరత్. అనకాపల్లి జిల్లాలో నిర్మించనున్న అర్సెల్లార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ పురోగతిపై చర్చ. తొలి దశలోనే దాదాపు రూ. 60 వేల కోట్లతో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్న అర్సెల్లార్ మిట్టల్ నిప్పన్ స్టీల్. ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు వివిధ దశల్లో ఉన్న అనుమతులపై లక్ష్మీ మిట్టల్ సమక్షంలో అధికారులతో సీఎం సమీక్ష. ఫిబ్రవరి 15లోగా అనుమతులు, భూసేకరణ అంశాలు పూర్తి చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం. ఫిబ్రవరి 15 తరవాత అనకాపల్లి జిల్లాలో ఆర్సెల్లార్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన చేయాలని నిర్ణయం. సాధ్యమైనంత త్వరగా స్టీల్ ప్లాంట్ నిర్మాణం పూర్తి చేసుకుని ఉత్పత్తి ప్రారంభించాలని అభిప్రాయపడిన సీఎం. ప్రభుత్వం నుంచి అనుమతులు, ఇతర సహకారం విషయంలో ఎక్కడా జాప్యం ఉండదని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి.

అవసరమైతే ఢిల్లీ వెళ్లి కేంద్రం నుంచి త్వరితగతిన అవసరమైన అన్ని అనుమతుల సాధించాలని మంత్రులు లోకేష్, టీజీ భరత్‌లకు సీఎం సూచన. ప్లాంట్ నిర్మాణం విషయంలో మంత్రి లోకేష్ నిరంతరం పర్యవేక్షిస్తున్నారని వ్యాఖ్యానించిన ఆదిత్య మిట్టల్. రాష్ట్రంలో వివిధ రంగాల్లో పెట్టుబడులు, పరిశ్రమల ఏర్పాటు గురించి లక్ష్మీ మిట్టల్‌కు వివరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు.

# గ్రీన్ అమ్మోనియా కేంద్రాల్లో పెట్టుబడులు పెట్టండి

**దావోస్:** దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో వివిధ దేశాలకు చెందిన వ్యాపారవేత్తలు, సీఈఓలతో భేటీ అవుతూ ఏపీ మంత్రి నారా లోకేశ్ బిజీ బిజీగా గడుపుతున్నారు. తాజాగా.. జపాన్‌కు చెందిన ప్రముఖ రెన్యువబుల్ ఎనర్జీ సంస్థ జెరా గ్లోబల్ సీఈవో అండ్ ఛైర్మన్ యుకియో కానితో మంత్రి లోకేశ్ దావోస్‌లో భేటీ అయ్యారు. ఏపీలోని గ్రీన్ అమ్మోనియా తయారీ కేంద్రాల్లో పెట్టుబడులు పెట్టాలని కోరారు లోకేశ్. జపాన్, ఇతర ఆసియా మార్కెట్లకు లో-కార్బన్ అమ్మోనియాను సరఫరా చేయడానికి మూలపేట, కృష్ణపట్నం, కాకినాడ పోర్టుల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉపయోగించుకుని సమీపంలోని గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి కేంద్రాల్లో పెట్టుబడులు పెట్టాలని వారికి విజ్ఞప్తి చేశారు లోకేశ్. పారిశ్రామిక వినియోగదారులకు దృఢమైన క్లీన్ ఎనర్జీ సరఫరా చేయడానికి రాయలసీమలో సౌర-పవన హైబ్రిడ్ ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని వెల్లడించారు. జపాన్ భవిష్యత్తు క్లీన్ ఇంధన దిగుమతులకు మద్దతు ఇవ్వడానికి భారత్‌లో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా వాల్యూ చైన్లను ఏర్పాటు చేయాలని జెరా సంస్థ నిర్ణయించుకుంది. రెన్యూ ఎనర్జీ గ్లోబల్‌తో భాగస్వామ్యం ద్వారా యుటిలిటీ-స్కేల్ పునరుత్పాదక శక్తి తయారీలో భాగస్వామ్యం వహిస్తున్నట్లు జెరా సీఈవో యుకియో వెల్లడించారు.



పునరుత్పాదక శక్తితో పాటు ఎల్ఎన్‌జీ ఆధారిత విద్యుత్ పరివర్తన, గ్రిడ్-బ్యాలెన్సింగ్ పరిష్కారాలపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.


# ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలి : ఏఓ హిమబిందు

**చేజర్ల, (రాజధాని వార్తలు):** చేజర్ల మండలం నాగులవెల్లటూరు మరియు పాడేరు రైతు సేవా కేంద్రం నందు ఈరోజు పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి హిమబిందు మాట్లాడుతూ, చాంపి యన్ ఫార్మర్ రైతుల వరి పొలాలను పరిశీలించడం జరిగింది. వారి పొలాలలో జింకు లోపాలను గుర్తించడం జరిగినది కావున జింకు స్ప్రే చేసుకోవాలని తెలియజేయడం జరిగినది. అదేవిధంగా రైతులు అందరూ ఎపిఎఫ్ఆర్ పోర్టల్‌నందు రిజిస్టర్ కాని వాళ్ళ పేర్లు రైతు సేవా కేంద్రం వారిగా వచ్చి ఉన్నాయి. వాళ్ళు వెంటనే ఆ రైతు సేవ కేంద్రంలో ఎపిఎఫ్ఆర్ పోర్టల్ నందు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి అలానే ప్రతి రైతు సాగు చేసిన ప్రతి పంటను పంట నమోదు చేసుకోవాలని తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో విఏఎలు శ్రీను, హాజరత్తయ్య మరియు



రైతులు పాల్గొన్నారు.

# ఏపీ లిక్కర్ కేసులో నిందితులకు సిట్ కస్టడీ



**విజయవాడ, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ కేసు విచారణలో సిట్ అధికారులు వేగం పెంచారు. రిమాండ్ ఖైదీలుగా ఉన్న నిందితులను విచారించడం ద్వారా ఈ కుంభకోణంలో ఎవరెవరి హస్తం ఉంది నిధుల మళ్లింపు ఎలా జరిగింది.? అనే కోణంలో సిట్ అధికారులు ఆధారాలు సేకరిస్తున్నారు.

నిందితుల కస్టడీ వివరాలివే..

విజయవాడ కోర్టు ఆదేశాల మేరకు ఇద్దరు ప్రధాన నిందితులను సిట్ అధికారులు విచారిస్తున్నారు.

రోనక్ కుమార్: రోనక్ కుమార్‌ను మూడు రోజుల పాటు సిట్ కస్టడీకి కోర్టు అనుమతించింది. రోనక్ కుమార్‌ను సిట్ కార్యాలయానికి తరలించి, ప్రత్యేక బృందాలు విచారణ జరుపుతున్నాయి. మద్యం సరఫరా, లైసెన్సుల మంజూరులో జరిగిన అవకతవకలపై ఆయనను ప్రశ్నించే అవకాశం ఉంది.

అనిల్ చోక్రా: అనిల్ చోక్రాను ఒక రోజు పాటు విచారించేందుకు కోర్టు అనుమతి ఇచ్చింది. అయితే.. భద్రతా కారణాల దృష్ట్యా అనిల్ చోక్రాను విజయవాడ జిల్లా జైల్లోనే విచారించాలని నిర్ణయించారు. తాజా సమాచారం ప్రకారం.. సిట్ అధికారులు ఇప్పటికే విజయవాడ జిల్లా జైలుకు చేరుకుని అనిల్ చోక్రాను విచారిస్తున్నారు. ఈ విచారణలో పలు కీలక అంశాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. లిక్కర్ పాలసీలో జరిగిన లోపాలు, ఇతర నిందితులతో ఉన్న సంబంధాల గురించి సిట్ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. మరోవైపు.. గుంటూరు జైల్లో ఉన్న మరికొంత మంది రిమాండ్ ఖైదీల గురించి కూడా సమాచారం సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.

కేసు నేపథ్యమిదే..

జగన్ హయాంలో మద్యం అమ్మకాలు, కంపెనీలకు చెల్లింపులు, డిజిటల్ పేమెంట్లకు సంబంధించిన లావాదేవీల్లో భారీ అక్రమాలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. నాణ్యత లేని మద్యం సరఫరా చేసిన కంపెనీలకు ఏ ప్రాతిపదికన అనుమతులు ఇచ్చారు? అనే విషయంపై సిట్ అధికారులు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. మద్యం దుకాణాల్లో కేవలం నగదు రూపంలోనే లావాదేవీలు జరగడం వెనుక ఉన్న వ్యూహం ఏమిటి? అని నిందితులను నిలదీస్తున్నారు. మద్యం వ్యాపారంలో రాజకీయ నాయకులు, ప్రైవేట్ వ్యక్తుల ప్రమేయం ఎంతవరకు ఉంది? అని ప్రశ్నిస్తున్నారు. నిందితులు ఇచ్చే సమాచారం ఆధారంగా.. మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా కీలక రాజకీయ నాయకులకు ఈ కేసుతో ఉన్న లింకులను ఛేదించేందుకు.. పక్కా ప్రణాళికతో సిట్ ముందడుగు వేస్తున్నట్టు సమాచారం. లిక్కర్ కేసులో సిట్ కస్టడీ విచారణ పూర్తి కాగానే.. సేకరించిన ఆధారాలను కోర్టుకు సమర్పించనున్నారు. ఈ స్కామ్ వల్ల రాష్ట్ర ఖజానాకు ఎంత నష్టం చేకూరింది? అనే దానిపై త్వరలోనే స్పష్టత రానుంది.

# ఏపీ రాజధానిగా అమరావతి చట్టబద్ధతకు రంగం సిద్ధం

**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని చట్టబద్ధంగా ప్రకటించేందుకు రంగం సిద్ధమైంది. అమరావతిని రాజధానిగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి అధికారికంగా వినతిపత్రం సమర్పించింది. 2024 జూన్ 2తో ఉమ్మడి రాజధాని గడువు ముగియడంతో.. ఏపీకి రాజధానిని తప్పక ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో, రాజధానిగా అమరావతి ఎంపిక ప్రక్రియ, నిర్మాణ కార్యక్రమాలపై వివరాలను కూడా కేంద్రానికి నోట్ ద్వారా అందించారు. ఈ విషయమై.. కేంద్రం ఇప్పటికే అన్ని మంత్రిత్వ శాఖల నుంచి అభిప్రాయాలు సేకరించేసి, నీతి ఆయోగ్ అభిప్రాయాన్ని కూడా కోరినట్లు సమాచారం. ఈ ప్రక్రియ పూర్తయ్యాక పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి అమరావతిని రాజధానిగా చట్టబద్ధంగా ప్రకటించేందుకు కేంద్రం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఏపీ ప్రభుత్వం సూచించిన ప్రకారం.. 2024 జూన్ 2 నుంచి అమరావతిని రాష్ట్ర రాజధానిగా ప్రకటించేందుకు అన్ని చర్యలు కొనసాగుతున్నాయని తెలుస్తోంది.



# గాయపడిన పోలీస్ కానిస్టేబుల్ ఆరోగ్యంపై హెూం మంత్రి అనిత ఆరా

## - మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఆదేశాలు



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** విజయనగరం జిల్లా గజపతి నగరం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ తిరుపతిరావు విధి నిర్వహణ సమయంలో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ప్రమాదంలో గాయపడిన తిరుపతిరావు ప్రస్తుతం జిల్లా సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర హెూం మంత్రి అనిత, కానిస్టేబుల్ తిరుపతి రావు ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్న వైద్యులతో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి, ప్రస్తుతం అందిస్తున్న వైద్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కానిస్టేబుల్ తిరుపతిరావుకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను మంత్రి అనిత ఆదేశించారు. అవసరమైతే అన్ని రకాల వైద్య సదుపాయాలు కల్పించాలని సూచించారు. అదేవిధంగా తిరుపతి రావు భార్యతో ఫోన్‌లో మాట్లాడిన హెూం మంత్రి, ఆమెకు ధైర్యం చెప్పారు. తిరుపతిరావు కుటుంబానికి ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని మంత్రి అనిత భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో కూడా మాట్లాడిన హెూం మంత్రి, చికిత్స విషయంలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని స్పష్టం చేశారు.

# చెక్కు బౌన్స్ కేసులో ఒకరికి జైలు శిక్ష

## - మేజిస్ట్రేట్ ఏ విజయ్ రాజ్ కుమార్

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** చెక్ బౌన్స్ కేసులో ఒక వ్యక్తికి ఏడాది జైలు, 2,20,000 రూపాయలు జరిమాన విధిస్తూ స్థానిక ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఏ.విజయ్ రాజ్ కుమార్ తీర్పు చెప్పారు. మంగళవారం కోర్టు కార్యాలయ సిబ్బంది అందించిన వివరాలు ప్రకారం, మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన కూర్మిన ఉమామహేశ్వర రెడ్డి, వైజాగ్ సీతమ్మదారకు చెందిన కోనాడ శ్రీనుకి లక్ష రూపాయలు అప్పుగా ఇచ్చారు. ఇందుకుగాను, కోనాడ శ్రీను 2021లో ఉమామహేశ్వర్ రెడ్డికి చెక్కు ఇవ్వగా, ఆ చెక్కు ప్రజెంట్ చేసిన నాటికి కోనాడ శ్రీను అకౌంటు క్లోజ్ అయింది. దీంతో ఉమామహేశ్వర రెడ్డి కోర్టును ఆశ్రయించగా, మెజిస్ట్రేట్ విజయ్ రాజ్ కుమార్ ఏడాది జైలు శిక్ష, రెండు లక్షల 20 వేల రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు పేర్కొన్నారు.



# రబీ లక్ష్యం దాటిన ఉద్యాన మిషన్ జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి సమీక్ష





**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి కృషి ఫలించింది. కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా రబీలో ఉద్యాన సాగు ఏకంగా 81 శాతం పెరిగింది. రబీలో సుమారు 4,000 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు చేయాలని జిల్లా కలెక్టర్ లక్ష్యం నిర్ణయించగా, అది 4,800 ఎకరాలకు చేరింది. గతేడాది రబీలో ఉద్యాన పంటలు కేవలం 1500 ఎకరాల్లోనే సాగవ్వగా, జిల్లా కలెక్టర్ రూపొందించిన ఉద్యాన మిషన్ కారణంగా ఈ ఏడాది సుమారు 3,300 ఎకరాలను అధికంగా సాగయింది. ఉద్యాన మిషన్‌పై జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి తమ క్యాంపు కార్యాలయంలో మంగళవారం సాయంత్రం సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఈ విషయాలను వెల్లడించారు. ఉద్యాన మిషన్లో భాగంగా జిల్లాలో ఈ ఏడాది మొత్తం పదివేల ఎకరాలలో అదనంగా ఉద్యాన సాగును చేయాలని లక్ష్యం పెట్టుకోగా, ఇప్పటికే రబీ లక్ష్యాన్ని సాధించారు. ఖరీఫ్‌లో మరో 6,000 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఈ సమావేశంలో కలెక్టర్ ఆదేశించారు. డిఆర్డిఎ పిడి శ్రీనివాస్ పాణి, ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ చిట్టిబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సందడిగా రంగోత్సవ్ పోటీలు





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు స్థానిక ఎంఈఓ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం మండల స్థాయి రంగోత్సవ్ పోటీలు సందడిగా జరిగాయి. (సంక్రాంతి) రంగోత్సవ్‌లో భాగంగా 6 నుంచి 8వ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారులు ఎస్.విమలమ్మ, బి.సాయి చక్రధర్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఫోక్ డాన్స్‌లో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినిలు జట్టు, హ్యాండ్ రైటింగ్‌లో ముచ్చర్ల ఉన్నత పాఠశాలకు చెందిన ఆర్.మణికంఠ, డ్రాయింగ్ పోటీల్లో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన జి.నిహారిక, రోల్ ప్లే, ముగ్గుల పోటీల్లో ముచ్చర్ల ఉన్నత పాఠశాలకు చెందిన జట్టు ప్రథమ స్థానంలో నిలిచాయి. ప్రథమ స్థానంలో నిలిచిన వారందరూ బుధవారం విజయనగరం డైట్ కళాశాలలో జరిగే జిల్లాస్థాయి రంగోత్సవ్ పోటీల్లో పాల్గొంటారని ఎంఈఓలు విమలమ్మ, సాయి చక్రధర్ ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిఆర్పిలు పాల్గొన్నారు.



# శ్రీ క్షేత్రంలో శ్రీనివాసునికి పంచామృత అభిషేకాలు


**విజయనగరం, (రాజధాని వార్తలు):** ప్రముఖ భారతీయ తత్వ దర్శన కేంద్రం శ్రీ క్షేత్రంలో కొలువై ఉన్న అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీనివాసునికి పం చామృత అభిషేకాలు చేశారు. శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించు కుని వేదమంత్రాల నడుమ శ్రీ వెంకటేశ్వర స్వామికి దేవాలయం అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు, అంపోలు లక్ష్మీ నరసింహాచార్యులు సంయుక్తంగా పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవంలో దేవాలయం ధర్మకర్తలు దుర్గా బాలాజీ, ఉమాదేవి దంపతులు, సురేష్ సుమలత దంపతులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల "ఆత్మీయ కలయిక"

## - తీర్చిదిద్దిన గురువులకు ఘన సత్కారం - ఆనంద డోలికల్లో బ్యాచ్ విద్యార్థులు



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** ఇంచుమించు 25 సంవత్స రాల క్రితం గజపతినగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు వారంతా తామంతా ఒకే చోట కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. అనుకున్నదే తడవుగా అందుకు తగ్గ వేదికను తాము చదువుకున్న పాఠశాలనే వారు ఎంచుకున్నారు. ఆదివారం 1996 – 2001 వరకు పదో తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. తమకు ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించుకున్నారు. అప్పటి ప్రధానోపాధ్యాయులు అల్లు అప్పలస్వామి, ఉపాధ్యాయులు వేణు మాస్టారు, లక్ష్మణరావు, రామారావు భాను ప్రకాష్, దైవ కృప, పద్మావతి, వరలక్ష్మి కాసులమ్మ తదితరులను ఈ సందర్భంగా వారు సత్కరించారు. శిష్యుల గురుభక్తికి గురువులు పులకించిపోయారు. ఎప్పుడో చదువు చెప్పిన తమను గుర్తుపెట్టుకుని ఈ విధంగా సత్కరించడం ఆనందదాయకమని గురువులు ఈ సందర్భంగా శిష్యులను అభినందించి ఆశీర్వదించారు. ఇదిలా ఉండగా, అంతకుముందు సభ వేదిక వద్దకు పూర్వ విద్యార్థులు ఒక్కొక్కరిగా వస్తూ, ఒకరిని ఒకరు పలకరించుకుంటూ, గత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకుంటూ ఆనంద డోలికల్లో మునిగి తేలారు. ఈ సమ్మేళనంలో వివిధ రాష్ట్రాల్లో, దేశాల్లో ఉద్యోగరీత్యా స్థిరపడిన చాలామంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఈ ఆత్మీయ కలయిక తమకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని పూర్వ విద్యార్థులు అన్నారు.



# శ్రీ వైకుంఠనారాయణ స్వామి వారికి పంచామృతాభిషేకాలు

**విజయనగరం, (రాజధాని వార్తలు):** ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణం శ్రీమద్రామాయణ ప్రాంగణంలో శ్రీ వైకుంఠనారాయణ స్వామివారికి పంచామృతాభిషేకాలు గావించారు. శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వైకుంఠనారాయణ స్వామి వారికి అర్చకులు చాణక్య, శ్రీ హర్ష, కృష్ణ తేజలు శాస్త్రోక్తంగా వేదమంత్రాల నడుమ పంచామృతాభిషేకాలు చేశారు. ఈ ఉత్సవంలో ఎన్ సి ఎస్ ట్రస్ట్ సభ్యులు పద్మశ్రీ, రమాదేవి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ యూత్ డే సందర్భంగా క్రీడల నుంచి సామాజిక చైతన్యానికి - "సేవ్ భద్రాచలం" యూతు బైక్ ర్యాలీ





**భద్రాచలం, (రాజధాని వార్తలు):** స్వామి వివేకానంద జయంతి (నేషనల్ యూత్ డే) సందర్భంగా భద్రాచలం పట్టణంలో ఇటీవల నిర్వహించిన అవుట్‌డోర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ద్వారా యువతను క్రీడల వైపు ప్రోత్సహించిన భద్రాచలం బ్యాడ్మింటన్ క్లబ్ (బి బి సి) మరియు డిపో యూత్, అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ సామాజిక అవగాహన కార్యక్రమంగా "సేవ్ భద్రాచలం" యూతు బైక్ ర్యాలీని నిర్వహించారు. బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో యువత చూపిన క్రీడా ఉత్సాహం, క్రమశిక్షణ, ఐక్యతను సమాజ ప్రయోజనాల కోసం ఉపయోగించాలనే ఉద్దేశంతో ఈ ర్యాలీని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. పోలీసు శాఖ సమన్వయంతో భద్రాచలం పోలీస్ స్టేషన్ నుంచి ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ పట్టణంలోని ప్రధాన రహదారుల మీదుగా సాగింది. ఈ సందర్భంగా యువత మత్తు పదార్థాలకు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, క్రీడలు–చదువు–సేవ అనే మూడు అంశాలతో జీవన లక్ష్యాన్ని నిర్మించుకోవాలని ప్రజలకు సందేశం ఇచ్చారు. టోర్నమెంట్ ద్వారా యువతలో ఏర్పడిన సానుకూల మార్పు సమాజ అవగాహన కార్యక్రమాల ద్వారా మరింత బలపడాలని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం పట్టణ సీఐ నాగరాజు, ఎస్ఐలు సతీష్, శ్యామ్ ప్రసాద్, ట్రాఫిక్ ఎస్ఐ తిరుపతి పాల్గొని యువత చేపడుతున్న అవగాహన కార్యక్రమాలను అభినందించారు. అలాగే కాంగ్రెస్ మండల అధ్యక్షులు పరిమి శ్రీనివాసరావు, పట్టణ పుర ప్రముఖులు పాకాల దుర్గాప్రసాద్, భద్రాచలం రోటరీ క్లబ్ అధ్యక్షురాలు వరలక్ష్మి, బత్తుల సాంబయ్య, రాంమోహన్ రెడ్డి, బొల్లి పృధ్వీరాజ్ పాల్గొని యువతకు తమ మద్దతు తెలిపారు. ఈ బైక్ ర్యాలీ కార్యక్రమంలో భద్రాచలం బ్యాడ్మింటన్ క్లబ్ (బి బి సి) మరియు డిపో యూత్ ప్రతినిధులు కుంజా సంతోష్, పండా అమృతరావు (అంబు), తాళ్ళ రమేష్, తాళ్ళ నాగరాజు, బోళ్ళ కృష్ణ, మణి, శంకర్, బత్తుల రమేష్, అనిల్, శాంత కుమార్, నరేందర్, బాలు, విజయ్, మల్లి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.



# జనవరి 23, 24, 25 తేదీల్లో ఖమ్మంలో జరిగే పిడిఎస్‌యూ 23వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**- 23వ రాష్ట్ర మహాసభల గోడపత్రిక ఆవిష్కరణ - పిడిఎస్‌యూ జిల్లా కార్యదర్శి మునిగేలా శివ ప్రశాంత్**




**భద్రాచలం, (రాజధాని వార్తలు):** ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం, భద్రాచలం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో జనవరి 23, 24, 25 తేదీల్లో ఖమ్మం పట్టణంలో జరగనున్న 23వ రాష్ట్ర మహాసభల గోడపత్రికను భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిడిఎస్ యూ జిల్లా కార్యదర్శి మునిగేలా శివ ప్రశాంత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యా రంగం సంక్షోభంలో ఉందని, ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో మౌలిక సదుపాయాలు లేవనీ, సంక్షేమ వసతి గృహాలలో చదువుకునే విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారనీ, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు కావట్లేదని, ప్రభుత్వం మధ్యాహ్నం భోజనం కోసం ఒక్కో విద్యార్థిపై వెచ్చించే డైట్ చార్జీలు సరిపోవట్లేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విచారంగంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. రాష్ట్రంలో పాఠశాల విద్యను గాడిలో పెట్టేందుకు ఎంఈఓ, డీఈవో, డిప్యూటీ డిఇఓ రెగ్యులర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యల పరిష్కారానికి తగు చొరవ చూపాలని కోరారు. 23వ రాష్ట్ర మహాసభలలో రాష్ట్రంలో విద్యారంగం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించనున్నట్లు, పలు తీర్మానాలు చేసి ఆయా సమస్యలపై భవిష్యత్తులో పోరాటాలు రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. 23వ తేదీన వేలాదిమంది విద్యార్థులతో భారీ ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందనీ విద్యార్థులు వేలాదిగా హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు జార్జి, ప్రవీణ్, సందీప్, శివ, తదితరులు పాల్గొన్నారు.

# వేడుకగా కే.ఏ.నాయుడు జన్మదిన వేడుకలు



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొండపల్లి అప్పలనాయుడు జన్మదిన వేడుకలు మంగళవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు నడుమ వేడుకగా జరిగాయి. ముందుగా పార్టీ నాయకులు ఏర్పాటుచేసిన కేకును కే.ఏ.నాయుడు కట్ చేశారు. అనంతరం ఒక్కొక్కరిగా ఆయనకు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బుద్ధరాజు నరసింహ వర్మ, మాజీ మండల పార్టీ అధ్యక్షులు అట్టాడ లక్ష్మునాయుడు, తెలుగుయువత పార్లమెంట్ అధ్యక్షులు వేమలి చైతన్య బాబు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొండబాబు రాజు, గొర్రెపాటి శ్రీనివాసరావు, గుసిడి జగన్నాథం, ఇల్లాపు కృష్ణ, మజ్జి రామునాయుడు, వెన్ను రామునాయుడు, బెజవాడ బంగారునాయుడు, తూమురోతు కృష్ణ, ఎ. వి.రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ పురస్కారానికి ఎంపికైన జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి

**- విజయనగరం జిల్లాకు "బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్" అవార్డు - ఈ నెల 25న పురస్కారాన్ని అందుకోనున్న కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి**



**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఎన్నికల నిర్వహణలో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు గాను విజయనగరం జిల్లాకు రాష్ట్ర స్థాయి పురస్కారం లభించింది. "బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు - 2025" కు విజయనగరం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.రాంసుందర్ రెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుండి మంగళవారం అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. జిల్లాలో ఓటరు జాబితా రూపకల్పన, ఓటర్ల నమోదు ప్రక్రియ మరియు ఎన్నికల విధుల్లో పాటించిన అత్యుత్తమ విధానాలను గుర్తిస్తూ ఈ అవార్డును ప్రకటించారు. గతంలో విజయనగరం జిల్లా కలెక్టరుగా పనిచేసిన డా.బి.ఆర్.అంబేద్కర్ కూడా ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. అదేవిధంగా బెస్ట్ ఎలక్ట్రోరల్ ప్రాక్టీసెస్ అవార్డుకు జిల్లా రెవెన్యూ అధికారి, కెఆర్ఆర్సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఈ.మురళి, ఉత్తమ బిఎల్ఓగా (గజపతినగరం నియోజకవర్గం, బొండపల్లి మండలం పోలింగ్ బూత్ -161) ఎల్.సత్యనారాయణ ఎంపికయ్యారు. ఈ నెల 25వ తేదీన 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే కార్యక్రమంలో ఈ అవార్డులను ప్రదానం చేయనున్నారు. జిల్లాకు ఈ గౌరవం దక్కడం పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, జిల్లా యంత్రాంగం హర్షం వ్యక్తం చేసింది.

# ఈ - పంట నమోదుతో రైతులకు మేలు జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** రైతులు తాము పండించిన పంటను ఈ - పంటలో నమోదు చేసుకోవాలని, తద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు అన్నారు. మంగళవారం మండలంలోని పురిటిపెంట గ్రామంలో రబీ పంట నమోదును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ-పంటలో నమోదు వలన రైతు పండించిన పంటకు మద్దతుధరతో పాటు, పంట నష్టనీ వచ్చినప్పుడు నష్ట పరిహారం, పంటలకు భీమా వర్తిస్తుందన్నారు.ఈ రబీ 2025-26 సీజన్లో ముఖ్యంగా వరి, మొక్క జొన్న, అపరాలు పంటలు సాగులో ఉంటాయన్నారు. మండలంలో 3360 ఎకరాలలో మొక్క జోన్న, 108 ఎకరాలలో వరి సాగు, 2500 ఎకరాలలో అపరాలు సాగు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.డి.ఏ అలజంగి నిర్మల జ్యోతి, వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్, వి.ఎ.ఎ అప్పల నాయుడు, గొర్లె బంగారు నాయుడు, రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థుల కోసం పర్యావరణ దినోత్సవాలు కాలమానిని ప్రతి ఒక్కరూ ఇంటి దగ్గర ప్రకృతి ఆధారంగా పంటలు పండించాలి : జిల్లా ఉద్యానవనాలశాఖ అధికారి ఎం.రాజశేఖరం

**అనకాపల్లి, విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విద్యార్థుల కోసం గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ రూపొందించిన పర్యావరణ దినోత్సవాల కాలమానిని (క్యాలెండర్) 2026 ఆవిష్కరించడం ఆనందదాయకం అని అనకాపల్లి జిల్లా ఉద్యానవనాల శాఖ అధికారి ఎం.రాజశేఖరం అన్నారు. మంగళవారం ఉదయం అనకాపల్లి ఉద్యానవన శాఖ కార్యాలయంలో ఆయన క్యాలెండరు విడుదల చేసిన తర్వాత నగరంలోని మిద్దె తోటల రైతులకు వంజంగి వంకాయ, దేశీయ టమాటా, బంతి, బాపట్ల మిర్చి తదితర మొక్కలు పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఈ కాలమానిని వినియోగించి పర్యావ రణ పరిరక్షణకు కృషి చేయాలి అని కోరారు. ప్రతి ఒక్కరూ ఇంటి దగ్గర ప్రకృతి ఆధారంగా పంటలు పండించాలి అని కోరారు. మిద్దె తోటల పెంపకం దారులకు తాము అవసరం అయిన శిక్షణ ఇస్తామన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద



కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు జాతి మొక్కలు అధికంగా పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేంగొ మేన్ అప్పాజీ, సిఫా సిఇఒ డాక్టర్ శశిప్రభ, యాక్షన్ ఎయిడ్ కర్ణాటక ప్రాజెక్ట్ సంస్థ అనకాపల్లి హెచ్ ఆర్ డి ఐ కృష్ణ కుమారి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం, అనకాపల్లి మిద్దె తోటల పెంపకందారులు పాల్గొని మాట్లాడారు.

# మక్కువ మెయిన్ రోడ్ నిర్మాణంపై అధికారులకు స్పష్టమైన సూచనలు ఇచ్చిన మంత్రివర్యులు గుమ్మిడి సంధ్యారాణి

**మక్కువ/ మన్యం జిల్లా, (రాజధాని వార్తలు):** 2 కోట్ల 65 లక్షల వ్యయంతో మంజూరైన మక్కువ మెయిన్ రోడ్డును మక్కువ మజ్జి గౌరమ్మ గుడి వద్ద నుండి మక్కువ బ్రిడ్జి వరకు ప్రజలకు దీర్ఘకాలంగా ఉపయోగపడే విధంగా, నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని గిరిజన సంక్షేమ శాఖ మరియు స్త్రీ-శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు గుమ్మిడి సంధ్యారాణి అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మక్కువ ఎంఆర్ఓతో పాటు సంబంధిత ఇంజినీరింగ్, రెవెన్యూ శాఖ అధికారులతో చర్చించి, రోడ్ నిర్మాణంలో సరైన వెడల్పు, బలమైన బేస్, నీటి పారుదల సౌకర్యాలు తప్పనిసరిగా కల్పించాలని ఆదేశించారు. భవిష్యత్తు ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని డిజైన్ చేయాలని,



పనులు వేగంగా మరియు పారదర్శకంగా పూర్తి చేయాలని సూచించారు.

# "ముక్త భారత్‌పై అవగాహన సదస్సు



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** బాల్య వివాహాలు నిర్మూలనే ధ్యేయంగా సుప్రీంకోర్టు చేపట్టిన వంద రోజుల ప్రచారంలో భాగంగా మంగళవారం పెద్దాపురం మండలం ఉలిమేశ్వరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం 2లో అవగాహన సదస్సు నిర్వహించారు మండల న్యాయ సేవాధికార సంస్థ చైల్డ్ హెల్ప్ లైన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ న్యాయవాది వల్లూరి సత్యవతి మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల పరిధిలోగల కిశోర బాలికలు బాల్యవివాహాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. 18 ఏళ్లు వయస్సు నిండకుండా వివాహాలు చేసుకుంటే కలిగే దుష్పరిణామాలు పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గ్రామాలలో అవగాహన లోపంతో బాల్య వివాహాలను ప్రోత్సహించే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రజలను చైతన్యవం తులను చేయడం ద్వారా బాల్య వివాహాలు నిర్మూలించడమే బాల్య వివాహ ముక్త భారత్ ప్రధాన లక్ష్యం అన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా బాల్య వివాహాలు చోటు చేసుకున్నట్లు తెలిస్తే తక్షణం గ్రామంలో గల అంగన్వాడీ వర్కర్లకు ఆశా వర్కర్లకు, గ్రామ సచివాల సిబ్బందికి సమాచారం ఇచ్చి వాటిని అడ్డుకోవలసిన బాధ్యత అందరి పైన ఉందని సూచించారు. ఈ సందర్భంగా వివిధ చట్టాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్ మాసా చంద్రరావు (చందు), అంగన్వాడీ కార్యకర్త వరలక్ష్మి, సహాయకురాలు కుమారి గ్రామస్తులు పాల్గొన్నారు.

# కరప మండలంలో దట్టమైన పొగ మంచు.. ప్రజలు ఇబ్బంది




**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలం పలు గ్రామాల్లో మంగళవారం ఉదయం 9 గంటల వరకు దట్టమైన పొగ మంచు కమ్మేసింది. విపరీతంగా కురిసిన మంచు కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత నాలుగు రోజులుగా సాయంత్రం 6 గంటల నుంచే చలి మొదలై ఉదయం 8:30 గంటల వరకు తీవ్రంగా కొనసాగుతుండటంతో వాదన సాధకులు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంట్లో దుప్పట్లు కప్పుకుని ఉన్నప్పటికీ చలి తట్టుకోలేకపోతున్నామని, ఇంతగా మంచు చలి గతంలో ఎప్పుడూ చూడలేదని పలువురు వాపోయారు. పొగ మంచు కారణంగా రహదారులపై దారి స్పష్టంగా కనబడక వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. సంక్రాంతి పండుగ సెలవులు ముగియడంతో స్కూలు బస్సులు, ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దట్టమైన మంచు



కమ్మేయడంతో వాహనదారులు లైట్లు ఆన్ చేసి అత్యంత జాగ్రత్తగా ప్రయాణం సాగించారు. ఈ పరిస్థితుల్లో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# సంపాదకీయం

## విపక్ష వైరుధ్యాలే బీజేపీ విజయ సోపానాలు

'భారత రాజకీయాల్లో కులం పోషించే సంక్లిష్ట పాత్రను గుర్తించడంలో కమ్యూనిస్టులు విఫలమయ్యారని అంగీకరించాలి. అదే విధంగా ప్రజలపై మతం ప్రభావాన్ని పూర్తిగా అర్థం చేసుకోవడంలో కూడా మేము విఫలమయ్యాం. కమ్యూనిస్టులు అనుసరించే గతి తార్కిక భౌతికవాదం ప్రజల చేతనలో భాగం కాలేదు' అని మరియం అలెగ్జాండర్ బేబీ గత ఏడాది పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తర్వాత ఒక ఇంటర్వ్యూలో అన్నారు. కేరళకు చెందిన బేబీ హయాంలోనే ఇవాళ కమ్యూనిస్టుల ఏకైక కోట అయిన ఆ రాష్ట్రంలో సీపీఐ (ఎం) నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ అధికారం కోల్పోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. ఆ స్థానంలో కాంగ్రెస్ సారథ్యంలోని ఎల్‌డీఎఫ్ పది సంవత్సరాల తర్వాత అధికారంలోకి వచ్చే అవకాశాలు ఉన్నప్పటికీ కేరళలో పెరుగుతోన్న బీజేపీ ప్రభావాన్ని అడ్డుకోలేకపోతోంది. మతపరమైన సంప్రదాయాలు, విశ్వాసాల గురించి జనంలో ప్రస్తావించేటప్పుడు ఆచితూచి మాట్లాడాలని ప్రస్తుత కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కూడా పార్టీ నేతలకు హితవు చెప్పారంటే కేరళలో బీజేపీ ప్రభావాన్ని ఆయన కూడా తక్కువ అంచనా వేయడంలేదనే చెప్పాలి. ఇవాళ దేశ వ్యాప్తంగా బీజేపీ విస్తరించడానికి వామపక్షాల వైఫల్యమే కారణమని సీపీఎం నేతల మాటల ద్వారానే అర్థం చేసుకోవచ్చు. భారతీయ జనతా పార్టీ చరిత్రలో ప్రప్రథమంగా బిహార్‌కు చెందిన యువ నేత నితిన్ నబీ జాతీయ అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెలువరించిన ప్రసంగంలో ఒక కొత్త ఉత్సాహం కొట్టొచ్చినట్లు కనపడుతోంది. 2014లో ఢిల్లీలో అడుగుపెట్టినప్పటి నుంచీ మోదీ క్రమక్రమంగా పార్టీపై పట్టు బిగుస్తూ పార్టీ యావత్తూ తన కనుసన్నలలో నడుస్తూ, తాను ఎవరిని సూచిస్తే వారిని కిమ్మనకుండా పార్టీ జాతీయ అధ్యక్షుడుగా ఎన్నుకునేలా చేస్తున్నారు. ఇదేమీ చిన్నవిషయం కాదు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం, మహారాష్ట్రలో స్థానిక ఎన్నికల్లో అసాధారణ విజయం సాధించిన తర్వాత సంభవించిన పరిణామమిది. ముంబైతో సహా 25 ప్రధాన నగరాల్లో బీజేపీ జయకేతనం ఎగురవేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ రాబోయే ఎన్నికల్లో కేరళలో కూడా బీజేపీని ప్రజలు ఆదరిస్తారన్న ఆశాభావాన్ని ప్రధానమంత్రి వ్యక్తం చేశారు. కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ వ్యాప్తంగా రాజకీయాలు మారిపోతున్నాయి. మహారాష్ట్రలో అయితే మరీ వేగంగా మారుతున్నాయి. థాకరే, శరద్ పవార్ పార్టీలను చీల్చడంలో బీజేపీ విజయవంతమయింది. క్రమంగా కాంగ్రెస్ కానీ, ప్రాంతీయ పార్టీలు కానీ బీజేపీని ఎదుర్కోవడంలో విఫలమయ్యే పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం ఇటీవల మహారాష్ట్ర మునిసిపల్ ఎన్నికల్లో మరింత స్పష్టమైంది. ఈ పార్టీలు విఫలమయినప్పుడు దేశంలో ముస్లిం ఓటర్లు తమకొక ప్రత్యామ్నాయం కోసం అన్వేషిస్తారని, ఏఐఎంఐఎం వంటి పార్టీని ఆశ్రయిస్తారని ఈ ఎన్నికలు తేల్చాయి. మహారాష్ట్రంలో థాకరే, పవార్ కుటుంబాలు మొదటి నుంచీ బలంగా ఉన్న ప్రాంతాల్లో సైతం తమ పట్టును కోల్పోయాయి. మోదీ జాతీయ స్థాయిలో అడుగుపెట్టకముందు మహారాష్ట్రలో బలహీనంగా ఉన్న బీజేపీ ఇప్పుడు ఆ రాష్ట్ర రాజకీయాల్లో కేంద్ర శక్తిగా మారింది. బీజేపీ వ్యతిరేక శక్తులన్నీ ఏకమై తాత్కాలిక విజయం సాధించినప్పటికీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆ కూటమి తుడిచిపెట్టుకుపోయింది. గ్రామ పంచాయతీ, మునిసిపల్ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి ప్రబల శక్తిగా ఆవిర్భవించింది. 2014కు ముందు 15 సంవత్సరాలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు మహారాష్ట్ర రాజకీయాల్లో తన స్థానమేమిటో తేల్చుకోలేని అగమ్యగోచర స్థితిలో ఉన్నది. గుజరాత్, బిహార్, ఒడిషాలో మాదిరి మహారాష్ట్రలో కూడా బీజేపీ అధికారం సుస్థిరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశంలో అతి పెద్ద పార్టీగా ఇప్పటికే విస్తరించిన బీజేపీ స్వాతంత్ర్యానంతరం కొన్ని దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీకి లభించిన ప్రాబల్యాన్నే సాధించిందనడంలో అతిశయోక్తి లేదు. కాంగ్రెస్, వామపక్షాలు, ఇతర బీజేపీయేతర పార్టీల సైద్ధాంతిక వైఫల్యానికి ఇది నిదర్శనం. కొత్త జాతీయ అధ్యక్షుడు ఎన్నికైన సమయంలో మహారాష్ట్ర స్థానిక ఎన్నికల తర్వాత కేరళ గురించి మోదీ ప్రస్తావించడం గమనార్హం. జనవరి 23న కేరళలో పర్యటించనున్న మోదీ ఆ రాష్ట్రంలో బీజేపీ ఎంతో కొంత కాలుమోపడంపై ఉత్సాహంతో ఉన్నారనడంలో సందేహం లేదు. 1980లో బీజేపీ ఆవిర్భవించిన తర్వాత దాదాపు రెండున్నర దశాబ్దాల వరకూ కేరళలో ఆ పార్టీకి ఉనికి కూడా లేదు. 2016లో బీజేపీ తొలి అసెంబ్లీ సీటు గెలుచుకుని అనేక నియోజకవర్గాల్లో ఓట్ల శాతాన్ని పెంచుకుంది. అయిదారు కార్పొరేషన్లలో ప్రతిపక్ష స్థానం సాధించింది. 2024లో తొలి లోక్‌సభ సీటును సాధించడమే కాక 19 శాతం ఓట్లను దక్కించుకుంది. అయిదు లోక్‌సభ సీట్లలో బీజేపీకి రెండు లక్షలకు పైగా ఓట్లు లభించాయి. 11 అసెంబ్లీ సెగ్మెంట్లలో అధిక ఓట్లు సాధించగా, 9 సీట్లలో రెండవ స్థానం సాధించింది. గత ఏడాది కేరళ స్థానిక ఎన్నికల్లో తొలి మునిసిపల్ కార్పొరేషన్‌ను దక్కించుకుంది. రాష్ట్ర రాజధాని అయిన తిరువనంతపురం మునిసిపల్ కార్పొరేషన్‌లో 50 సీట్లు సాధించి 45 సంవత్సరాలుగా వామపక్ష ఫ్రంట్ గుప్పిట్లో ఉన్న అనేక స్థానాలను కైవసం చేసుకుంది. 174 గ్రామపంచాయతీలు, 4 జిల్లా పంచాయతీలు, నాలుగు సిటీ కార్పొరేషన్లు దక్కించుకున్న బీజేపీ కేరళలో దాదాపు 15 శాతం ఓట్లు సాధించగలిగింది. అన్నిటికన్నా ఎక్కువగా తిరువనంతపురంలో 23 శాతం దక్కించుకోగా, అనేక చోట్ల 19 శాతం ఓట్లను సాధించింది. క్రమంగా కేరళలో యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్‌ల తర్వాత బీజేపీ మూడో స్థానం కోసం ఉరకలు వేస్తోంది.

# 28 నుంచి ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ సభ్యత్వ, రెన్యువల్ నమోదు కార్యక్రమం

**- వారం రోజులు పాటు నిర్వహణ - జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వానికి మరోసారి వినతులు - జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల**



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ బ్రాడ్ కాస్ట్ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్‌ల సభ్యుల సభ్యత్వ నమోదు, రెన్యువల్ కార్యక్రమాన్ని ఈనెల 28 నుంచి ప్రారంభించనున్నట్లు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షులు పి నారాయణ, కార్యదర్శి జి శ్రీనివాసరావులు తెలిపారు. మంగళవారం ఇక్కడ అక్కయ్యపాలెం జంక్షన్ లో ఒక ప్రైవేట్ హోటల్లో ఈ మేరకు కార్యవర్గ సభ్యులతో నూతనసభ్యత్వ రెన్యువల్‌కు సంబంధించిన అంశాలపై వీరు చర్చించారు. అనంతరం వీరు మాట్లాడుతూ ఈనెల 28 నుంచి వారం రోజులు పాటు ఏపీ ఎన్జీవో హోంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున నూతన సభ్యత్వం, రెన్యువల్ కోసం జర్నలిస్టులు పాస్ పోర్ట్ ఫోటో, ఆధార్ కార్డు తగిన వివరాలతో నేరుగా వచ్చి గుర్తింపు కార్డులు పొందాలని కోరారు. సభ్యుల పూర్తి చిరునామా ఇతర వివరాలు తీసుకున్న అనంతరం వారికి నూతన సభ్యత్వ కార్డు అలాగే వాహనానికి సంబంధించిన ఫెడరేషన్ యూనియన్ స్టిక్కర్ అందజేయడం జరుగుతుందన్నారు. గత ఏడాది విశాఖ జిల్లా వరకు తమ యూనియన్ లో 600 మంది సభ్యత్వ నమోదు చేయించుకున్నట్లు వీరు చెప్పారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాలు కార్యవర్గాలు అక్కడ ప్రత్యేకము గా వేర్వేరుగా కార్యక్రమాలు ఏర్పాటు చేసి సభ్యత్వ రెన్యువల్ కార్యక్రమం త్వరలో ప్రారంభిస్తామన్నారు. జర్నలిస్టుల పెండింగ్ సమస్యలపై త్వరలోనే ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి, మంత్రి నారా లోకేష్‌లను తమ రాష్ట్ర కార్యవర్గంతో కలిసి మరోసారి వినతి పత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ విశాఖ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాస్, బ్రాడ్ కాస్ట్ అధ్యక్షులు ఇ.ఈశ్వరరావు, కార్యదర్శి కె.మదన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి. రవికుమార్, ఏ సాంబశివరావు, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్మోహన్ ఆయా యూనియన్ కార్యవర్గ ప్రతినిధులు బొబ్బర ప్రసాద్, కిషోర్, వేణు, కామన్న, కె.వి శర్మ, కృష్ణమూర్తి నాయుడు, గోపాల్, పిల్లా నగేష్ బాబు, రాజశేఖర్, పి.నాగేశ్వరరావు తదితరులంతా పాల్గొన్నారు.

# జీవీఎంసీ అభివృద్ధి కార్యక్రమాలపై పట్టణ అధ్యయన బృందంతో సమావేశమైన జీవీఎంసీ కమిషనర్

**- జీవీఎంసీ అభివృద్ధి కార్యక్రమాలు ఆదర్శనీయమని పేర్కొన్న అధ్యయన బృందం**



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ – ఐ ఐ పి ఎ, న్యూఢిల్లీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 51వ అడ్వాన్స్‌డ్ ప్రొఫెషనల్ ప్రోగ్రామ్ ఇన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో భాగంగా ఐఐపిఎ డైరెక్టర్ జనరల్ సురేంద్రనాథ్ త్రిపాఠి సారథ్యంలో ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ సచిన్ చౌదరితో కలసి 9 మంది అర్బన్ స్టడీ విజిట్ బృందం విశాఖ నగరానికి విచ్చేసి మంగళవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ తన చాంబర్‌లో సమావేశం నిర్వహించగా, కమిషనర్‌తో పాటు జీవీఎంసీ ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో నగర అభివృద్ధి, సుందరీకరణ, స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు, పారిశుద్ధ్యం, మౌలిక వసతులు, పట్టణ ప్రణాళికలు, ప్రజాసేవా కార్యక్రమాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు తదితర వాటి అమలు తీరుపై జీవీఎంసీ చేపడుతున్న చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధ్యయన బృందానికి జీవీఎంసీ కమిషనర్, విభాగాధికారులు వివరించారు. కేంద్ర ప్రభుత్వ వివిధ విభాగాలు, అఖిల భారత సేవలు, రక్షణ దళాలకు చెందిన సీనియర్ అధికారులతో కూడిన ఈ అధ్యయన బృందం, పట్టణ పాలనలో సంస్థల పాత్ర, ప్రజలకు అందుతున్న సేవలు, అమలు అవుతున్న పథకాల ప్రభావం వంటి అంశాలపై అవగాహన పొందేందుకు ఈ అధ్యయన పర్యటన చేపట్టినట్లు కమిషనర్‌కు వారు తెలిపారు. జీవీఎంసీ అభివృద్ధి కార్యక్రమాలు ఆదర్శనీయంగా ఉన్నాయని వారు ప్రశంసించారు. ఈ అధ్యయన పర్యటనలో భాగంగా జనవరి 19 నుండి 23 వరకు విశాఖపట్నం పర్యటిస్తున్న బృందం, జీవీఎంసీతో పాటు విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ, విశాఖపట్నం పోర్ట్ అథారిటీ మరియు ఇతర స్థానిక స్థాయి సంస్థలను కూడా సందర్శించి, అక్కడి అధికారులతో పరస్పర చర్చలు నిర్వహించనుంది. ఈ అధ్యయన బృందం పర్యటన ద్వారా విశాఖపట్నం నగరంలో అమలవుతున్న పట్టణాభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల అభివృద్ధి, పాలన విధానాలపై సమగ్ర అవగాహన కలుగుతుందని కమిషనర్ తెలిపారు. అనంతరం పట్టణ అధ్యయన బృందం కాపులుప్పాడలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్, ముడసరలోవలో ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్, నరవలో వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ సందర్శించి వాటి నిర్వహణలు ఆదర్శనీయంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ పీఎం. సత్యవేణి, ప్రధాన ఇంజనీర్ పి వి సత్యనారాయణ రాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ ఎన్ వి నరేష్ కుమార్, చీఫ్ సిటీ ప్లానర్ ఏ ప్రభాకరరావు, ఈ సిడి డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# ముంచెత్తిన మంచు తుఫాన్...!

**- పొగ మంచుతో దారి కానరాక అవస్థలు**





**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పలు జిల్లాలను మంచు తుఫాన్ ముంచివేసింది. దట్టమైన పొగ మంచు పట్టణాలను పల్లెలను కమ్మి వేయడంతో ఉదయం 9 గంటల వరకు ప్రజలంతా ఇళ్లలోంచి బయటకు రాలేని పరిస్థితిలో ఏర్పడ్డాయి. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణాలు చేయాల్సిన వాహనదారులు పొగ మంచు కారణంగా వారు వెళ్లే మార్గం కనిపించకపోవడంతో నానా ఇబ్బందులు పడ్డారు. పట్టపగలు లైట్లు వేసుకుని ప్రయాణాలు కొనసాగించినా రహదారులు కనిపించనంత విధం గా దట్టమైన పొగమంచు సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం అంతా తీవ్రస్థాయిలో ముం చెత్తింది. విశాఖపట్నం వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించిన విధంగానే విజయనగరం జిల్లా మొదలు కృష్ణా జిల్లా వరకు రానున్న మూడు రోజుల్లో విపరీతమైన పొగ మంచు ముంచెత్తుతుందని వాతావరణ అధికారులు చేసిన హెచ్చరికలు నిజమయ్యాయి. బయట బహిరంగ ప్రదేశాల్లో కురిసిన పొగమంచు కిటికీల గుండా ఇళ్లలోకి ప్రవేశించి ప్రజలను ఇబ్బందులకు గురి చేసింది. గత కొద్ది రోజులుగా కురుస్తున్న మంచు ప్రభావంతో ప్రజలు స్వల్ప అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు.

దానికి మించి మామిడి రైతు కుబేర అవుతున్నాడు. పొగమంచు కారణంగా మామిడి పంటకు వస్తున్న పూత మొత్తం మాడిపోతుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలా ఉండగా మరో రెండు రోజులపాటు ఇదే రీతిలో పొగ మంచు రాష్ట్రంలోని పలు జిల్లాలను ముంచేత్తుతుందని వాతావరణ అధికారులు చెబుతుండగా ప్రజలు దానిని గమనించి శీతల మంచు ప్రభావానికి గురి కాకుండా తగిన జాగ్రత్తలు వహించాలని అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు.

# నూరు శాతం ఉత్తీర్ణతపై ఎంఈవో పరిశీలన



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** రాష్ట్ర విద్యాశాఖ ఆదేశానుసారం పదవ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో 100 శాతం పాస్ అవ్వడానికి 100 డేస్ యాక్షన్ ప్లాన్‌ను ఇవ్వడం జరగగా దాని అమలు తీరును మండల విద్యా శాఖ అధికారి పి పుల్లయ్య మంగళవారం పరిశీలించారు. సామర్లకోట మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలను పరిశీలిస్తున్న కార్యక్రమంలో భాగంగా సామర్లకోట గవర్నమెంట్ బాలుర ఉన్నత పాఠశాలను ఎంఈవో సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు సాయంత్రం క్లాస్‌లో రోజుకో సబ్జెక్ట్ మీద స్లిప్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను షైనింగ్ స్టార్, రైసింగ్ స్టార్‌గా గుర్తించి వారికి ప్రత్యేకమైన శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియ జరిగే విధానాన్ని పరిశీలించడానికి విద్యాశాఖతో పాటు ఇతర శాఖల అధికారులు కూడా పాఠశాలలను సందర్శించడం జరుగుతుందన్నారు. కాగా మంగళవారం జరిగే పరీక్షను ఎంఈవో పుల్లయ్య పరిశీలించారు. కాగా ఈ పాఠశాలలో 52 మంది విద్యార్థులు ఉండగా షైనింగ్ స్టార్‌లో 32 మంది విద్యార్థులు, రైసింగ్ స్టార్‌లో మరో 20 మంది విద్యార్థులు ఉన్నట్టు గుర్తించారు. కాగా వీరికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతున్నదన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుసుమ, ఉపాధ్యాయులు అప్పారావు, రామ్ నారాయణ, వేణు గోపాల్ పాల్గొన్నారు.

# ఆర్ఎంసిలో మిస్ యూనివర్స్ ఇండియాకు ఘన సన్మానం



**కాకినాడ, (రాజధాని వార్తలు):** జాతీయ స్థాయి అందాల పోటీలో ఫారెవర్ మిస్ యూనివర్స్ ఇండియా – 2025 కిరీటాన్ని కైవసం చేసుకుని విశేష ఖ్యాతిని సంపాదించిన రంగారాయ మెడికల్ కాలేజ్ అలుమ్నా డా.ఎం.సృజనాదేవికి కళాశాలలో ఘన స్వాగతం, సన్మానం నిర్వహించారు. రాష్ట్రానికి, వైద్యరంగానికి గర్వకారణమైన ఆమె చేరికతో కళాశాల ప్రాంగణం ఉత్సాహభరితంగా మారింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కళాశాల ప్రిన్సిపల్ డా.విష్ణు వర్ధన్ డా.సృజనాదేవిని శాలువాతో, పుష్పగుచ్ఛంతో అంగవైభవంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులతో మమేకమవుతూ డా.సృజనాదేవి తన విద్యా దశలోని తీపి జ్ఞాపకాలను పంచుకున్నారు. పాత హాస్టల్‌ను సందర్శించిన ఆమెకు పునశ్చరణ భావాలు వెల్లివిరిశాయి. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆమె "లక్ష్యం పెద్దదై ఉండాలి" ఆకాశమే హద్దు. ఆత్మవిశ్వాసం, క్రమ శిక్షణ, నిరంతర శ్రమ – ఇవి ఉంటే ఏ కల అయినా నిజమవుతుందని ప్రేరణాత్మక సందేశం అందించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో విశేష ఉత్సాహం, ఉత్తేజాన్ని నింపిందని కళాశాల యాజమాన్యం వెల్లడించింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.విష్ణువర్ధన్, అటానమీ విభాగాధిపతి & వైస్ ప్రిన్సిపల్ డా. శశి, ట్రస్ట్ హాస్పిటల్స్ డైరెక్టర్, అలాగే ఐఎంఏ కాకినాడ కార్యదర్శి డా.రామకృష్ణ పాల్గొన్నారు.

# ఘనంగా గ్రంధి బాబ్జి జన్మదిన వేడుకలు



**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్, కరప మండలం వాకాడ గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శ్రీ బాలత్రిపుర సుందరిదేవి దేవాలయ చైర్మన్, స్కూల్ చైర్మన్, టిడిపి నాయకులు గ్రంధి బాబ్జి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ సీనియర్ నాయకులు, స్థానిక అధికారులు, వివిధ సామాజిక సంఘాల ప్రముఖులు భారీ సంఖ్యలో హాజరై గ్రంధి బాబ్జికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తనయుడు పంతం సందీప్ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. గ్రంధి బాబ్జిని దుస్సాలువాతో సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యారంగం అభివృద్ధికి, ఆధ్యాత్మిక సేవలకు గ్రంధి బాబ్జి చేస్తున్న కృషి ప్రశంసనీయమని కొనియాడారు.

# రష్మిక – విజయ్ పెళ్లి ఫిక్స్.. కన్ఫర్మ్ చేసిన అధ్యక్షుడు!



గత నాలుగు సంవత్సరాలుగా ప్రముఖ టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ.. పాన్ ఇండియా హీరోయిన్ రష్మిక మందన్న రిలేషన్‌లో ఉన్నారు అంటూ వార్తలు జోరుగా వినిపిస్తున్న విషయం తెలిసిందే.ముఖ్యంగా రష్మిక మందన్న, విజయ్ దేవరకొండ కలసి తొలిసారి నటించిన చిత్రం గీతా గోవిందం. ఈ సినిమా సమయం నుంచే వీరిద్దరి మధ్య ఎఫైర్ రూమర్స్ గుప్పుమన్నాయి. దీనికి తోడు వీరిద్దరూ కలిసి డియర్ కామ్రేడ్ సినిమాలో కూడా కలిసి నటించారు.ఈ సినిమా తర్వాత వీరిద్దరూ ఎక్కడ కలిసి కనిపించినా ఈ రూమర్స్ మరింత బలంగా వినిపించాయి. అయితే మీడియా కంట పడకుండా ఈ జంట ఎంత ప్రయత్నం చేసినప్పటికీ.. ఆడియన్స్, నెటిజన్స్ నుండి తప్పించుకోలేకపోయారు. ఇక ఎట్టకేలకు గత ఏడాది రహస్యంగా నిశ్చితార్థం చేసుకున్నారు. అయితే ఈ విషయాన్ని కూడా వీరు బయట పెట్టలేదు. ముఖ్యంగా తమ వ్యక్తిగత జీవిత విషయానికి సంబంధించిన విషయాలను వీరు గోప్యంగా ఉంచడం అభిమానులను కూడా ఆశ్చర్యపరుస్తోంది. ఇకపోతే ఈ ఏడాది ఉదయపూర్ లో ఫిబ్రవరి 26వ తేదీన ఈ జంట డెస్టినేషన్ వెడ్డింగ్ జరుపుకోబోతున్నారు అంటూ గత కొద్ది రోజులుగా వార్తలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న రష్మిక దీనిపై స్పందిస్తూ.. గత నాలుగు సంవత్సరాలుగా ఇలాంటి రూమర్లు వినిపిస్తూనే ఉన్నాయి. అయితే సమయం వచ్చినప్పుడు అన్నింటికీ సమాధానం దొరుకుతుంది అంటూ తనదైన శైలిలో స్పష్టం చేసింది. అయితే రష్మిక, విజయ్ దేవరకొండతో పెళ్లిపై క్లారిటీ ఇవ్వనుందా లేక మరేదైనా ట్విస్ట్ ఇస్తుందా అని అనుమానాలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా వీరిద్దరూ పెళ్లి చేసుకుంటారని ఎదురుచూసిన అభిమానులకు ఎప్పటికప్పుడు నిరాశే మిగులుతోంది. అయితే సడన్గా ఒక వ్యక్తి వీరిద్దరి వివాహాన్ని కన్ఫర్మ్ చేస్తూ చేసిన కామెంట్లతో అభిమానులే కాదు సినీ సెలబ్రిటీలు, నెటిజన్లు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అసలు విషయంలోకి వెళ్తే.. ఫ్లవర్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు శ్రీకాంత్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆయన తాజాగా విజయ్ – రష్మిక జంటకు విషెస్ చెబుతూ.. వారి పెళ్లికి తమ తరఫున అత్యంత నాణ్యమైన డచ్ గులాబీలు పంపనున్నట్లు స్పష్టం చేశారు. ఈ ఫ్లవర్స్ వారి వేడుకను మరింత అందంగా మారుస్తాయని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. మొత్తానికైతే ఇంతవరకు రష్మిక – విజయ్ దేవరకొండ నుంచీ తమ పెళ్లిపై ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.

కానీ సడన్గా ఫ్లవర్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు శ్రీకాంత్ చేసిన కామెంట్లు మాత్రం సోషల్ మీడి యాలో ఒక్కసారిగా అందర్నీ ఆశ్చర్యపరుస్తున్నాయి. ఆయన ఈ విషయంపై స్పష్టం చేశారు అంటే కచ్చితంగా వీరి బంధం నిజమే.. ఇక త్వరలోనే వీరి పెళ్లి జరగనుంది అంటూ నిర్ధారణకు వచ్చేస్తున్నారు. ఏదేమైనా రష్మిక – విజయ్ దేవరకొండ పెళ్లి చేసుకుంటే చూడాలని ఆకాంక్షించే అభిమానులే కాదు సెలబ్రిటీలు కూడా ఉన్నారడంలో సందేహం లేదు.

# అప్పుడు వరుణ్‌తేజ్..ఇప్పుడు శర్వానంద్!






బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్‌లుగా నిలిచి సదరు హీరోల కెరీర్‌లని మలుపు తిప్పిన సినిమాలు ఇండస్ట్రీలో చిరస్థాయిగా నిలిచిపోయి చరగని ముద్ర వేస్తాయి. అలాంటి సినిమా టైటిల్స్‌ని మళ్లీ వాడాలంటే చాలా గట్స్ ఉండాలంటారు. కారణం ఆ ఐకానిక్ హిట్ తాలూకు ఇంపాక్ట్‌ని మళ్లీ కలిగించలేకపోతే ప్రేక్షకుల ఆదరణ లభించదు. ఫలితంగా సినిమా ఫ్లాప్ అవుతుంది. అంతే కాకుండా ఐకానిక్ హిట్ సినిమా టైటిల్‌ని, దానికున్న ఇమేజ్‌ని చెడగొట్టారనే చెడ్డపేరు మూటగట్టుకున్న వారవుతారు. అందుకే టాలీవుడ్‌లో చాలా మంది ఐకానిక్ హిట్ సినిమాల టైటిల్స్‌ని మళ్లీ వాడుకోవడానికి భయపడుతుంటారు.

అయితే కొంత మంది అభిమా నం పేరుతో వాడుకుంటూ ఆ క్రేజ్‌ని క్యారీ చేయలేక బాక్సాఫీస్ వద్ద బోల్తాపడి పరాభవాల్ని ఎదుర్కొంటుంటే మర కొంత మంది హీరోలు మాత్రం చాలా పక్కాగా ప్లాన్ చేసుకుని ఐకా నిక్ టైటిల్స్‌తో సినిమాలు చేస్తూ సక్సెస్‌లని దక్కించుకుని వాటికున్న గౌరవాన్ని, సెంటిమెంట్‌ని పెంచేస్తున్నారు. ఇలా ఎవర్ గ్రీన్ ఐకానిక్ టైటిల్స్‌ని మళ్లీ వాడి సూపర్ హిట్‌లని అందుకున్న హీరోలు అప్పుడు వరుణ్ తేజ్. ఇప్పుడు శర్వా నంద్. పవన్ కల్యాణ్ కెరీర్‌లో ఐకానిక్ హిట్‌లుగా నిలిచిన సినిమాలు ‘తొలిప్రేమ’, ‘తమ్ముడు’. ఇందులో ‘తమ్ముడు’ టైటిల్‌ని నితిన్ రీసెంట్‌గా వాడి భారీ డిజాస్టర్‌ని దక్కించుకున్న విషయం తెలిసిందే. దిల్ రాజు నిర్మాణంలో వేణు శ్రీరామ్ తెరకెక్కించిన ‘తమ్ముడు’ భారీ అంచనాల మధ్య విడుదలై డిజాస్టర్ అనిపించుకుని నితిన్‌తో పాటు దిల్ రాజుకు ఊహిం చని షాక్ ఇచ్చింది. అభిమాన హీరో ఐకానిక్ టైటిల్ వాడి హిట్టు కొట్టలేకపోయానని హీరో నితిన్ కూడా ఫీలయ్యాడు. అయితే పవన్ కెరీర్‌లో ఎవర్‌గ్రీన్ లవ్‌స్టోరీగా నిలిచి తనకు భారీ బ్లాక్ బస్టర్ హిట్‌ని అందించిన ‘తొలిప్రేమ’ టైటిల్‌కు మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ న్యాయం చేశాడు. తను హీరోగా వెంకీ అట్లూరి తెరకెక్కించిన రొమాంటిక్ లవ్‌స్టోరీకి ‘తొలి ప్రేమ’ టైటిల్‌ని తీసుకోవడం..అనుకున్నట్టే సూపర్ హిట్‌ని సొంతం చేసుకోవడం తెలిసిందే. ఇప్పుడు ఇదే తరహాలో మరో ఐకానిక్ టైటిల్‌ని తీసుకుని హీరో శర్వానంద్ కూడా ఇదే ఫలితాన్ని దక్కించుకోవడం విశేషం. నందమూరి బాలకృష్ణ హీరోగా శోభన, నిరోష హీరోయిన్‌లుగా నటించిన మూవీ ‘నారీ నారీ నడుమ మురారీ’. అప్పట్లో మంచి విజయాన్ని సొంతం చేసుకున్న ఈ సినిమా టైటిల్‌ని తీసుకుని రొమాంటిక్ కామెడీ మూవీని చేశాడు. రామ్ అబ్బరాజ్ దర్శకత్వంలో అనిల్ సుంకర నిర్మించగా సంయుక్త మీనన్, సాక్షీ వైద్య హీరోయిన్‌లుగా నటించారు. జనవరి 14న సంక్రాంతి బరిలో విడుదలైన ఈ సినిమా ఆద్యంత వినోదాన్ని అందిస్తూ ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంటోంది. బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సాధించి చాలా రోజుల తరువాత హీరో శర్వానంద్‌కు సక్సెస్‌ని అందించింది. ఐకానికి టైటిల్‌తో సినిమా ప్రకటించినప్పుడే దీన్ని చెడగొట్టకుండా ఉంటే చాలనే కామెంట్‌లు వినిపిస్తుంటాయి. ఆ కామెంట్‌లని దృష్టిలో పెట్టుకుని బాలయ్య టైటిల్‌కి శర్వా పూర్తి న్యాయం చేశాడు.

# మెగా ఫ్యామిలీలో మరో సర్ ప్రైజ్ ఎంట్రీ



మెగాస్టార్ చిరంజీవి నటించిన మన శంకరవరప్రసాద్ గారు సినిమా ఈ సంక్రాంతికి రిలీజై బాక్సాఫీస్ దగ్గర మంచి కలెక్షన్లతో దూసుకుపోతోంది. సినిమా సక్సెస్ ఎంజాయ్ చేస్తున్న టైంలో మేకర్స్ లేటెస్ట్‌గా ఈ మూవీలోని ఫ్లైయింగ్ హై వీడియో సాంగ్‌ను రిలీజ్ చేశారు. ఈ సాంగ్ ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఈ పాటతో ఒక కొత్త టాలెంట్ టాలీవుడ్‌కి పరిచయమైంది. ఆమే నైరా. ఈమె ఎవరో కాదు మెగాస్టార్ చిరంజీవి సోదరి మాధవి గారి కుమార్తె. అనిల్ రావిపూడి, నిర్మాత సుస్మిత సోషల్ మీడియా వేదికగా నైరాను పరిచయం చేస్తూ ఈ విషయాన్ని కన్ఫర్మ్ చేశారు. మెగా ఫ్యామిలీ నుంచి మరో వారసురాలు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టడం ఇంట్రెస్టింగ్‌గా మారింది. నైరా సింగింగ్‌లో ప్రాపర్ ట్రైనింగ్ తీసుకున్నట్టు తెలుస్తోంది. సింగపూర్‌లోని లాసాల్ కాలేజ్ ఆఫ్ ది ఆర్ట్స్‌లో పాప్ మ్యూజిక్ స్టూడెంట్‌గా ఉన్న ఆమెకు ఈ సినిమాలో ఛాన్స్ రావడం ఒక మంచి బిగినింగ్ అని చెప్పొచ్చు. ఫ్లైయింగ్ హై సాంగ్‌లో ఆమె వాయిస్ చాలా ఫ్రెష్‌గా ఉండటమే కాకుండా ఈ తరం ఆడియన్స్‌కి నచ్చేలా ఉంది. నైరా పెర్ఫార్మెన్స్ చూసి సుస్మిత కొణిదెల ఎమోషనల్ అయ్యారు. తన నాన్న సినిమాలో తన కజిన్ పాట పాడటం గర్వంగా ఉందని ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. నైరా వాయిస్‌లో మంచి క్లారిటీ స్టైల్ ఉన్నాయని.. సింగర్‌గా ఆమెకు మంచి ఫ్యూచర్ ఉంటుందని విష్ చేశారు.

మెగా ఫ్యామిలీ నుంచి ఇప్పటివరకు హీరోలు హీరోయిన్లు మాత్రమే వచ్చారు కానీ ఒక సింగర్ రావడం ఇదే మొదటిసారి. ఇప్పటికే ఈ పాట మ్యూజిక్ లవర్స్?ను ఆకట్టుకుంటోంది. తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకోవడానికి నైరా వేసిన ఈ మొదటి అడుగు చాలా ప్రామిసింగ్‌గా కనిపిస్తోంది. ఇక మన శంకరవరప్రసాద్ గారు సినిమా ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద 300 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లతో మంచి ట్రాక్ లో వెళుతోంది. పండగ సెలవులు ముగిసిన తరువాత కూడా లెక్క ఏమాత్రం తగ్గడం లేదు. సోమవారం కూడా మంచి కలెక్షన్స్ వచ్చాయి. అనిల్ రావిపూడి మేకింగ్ స్టైల్‌లో మెగాస్టార్ కామెడీ టైమింగ్ పర్ఫెక్ట్‌గా సెట్ కావడంతో చాలా రోజుల తరువాత పర్ఫెక్ట్ సినిమా పడింది. ఆడియెన్స్ ఫ్యామిలీస్‌తో కలిసి సినిమాను ఎంజాయ్ చేస్తు న్నారు. ఈ సంక్రాంతికి పోటీ ఎంత ఉన్నా కూడా బాస్ పవర్ ఏమిటో మరోసారి రుజువైంది. ఇక సినిమాలో నయన తార హీరోయిన్‌గా నటించగా భీమ్స్ ఇచ్చిన మ్యూజిక్ కూడా పాజిటివ్ వైబ్స్ క్రియేట్ చేసింది.

# పవన్ కళ్యాణ్ పీఎం అయినా ఆశ్చర్యం లేదు.. నిధి అగర్వాల్ బోల్డ్ స్టేట్‌మెంట్!



ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పొలిటికల్ జర్నీపై ‘హరిహర వీరమల్లు’ బ్యూటీ నిధి అగర్వాల్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గత ఏడాది విడుదలైన వీరమల్లు సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో సక్సెస్ కాకపోయినప్పటికీ, ఆ షూటింగ్ సమయంలో పవన్‌ను దగ్గర నుండి గమనించిన నిధి.. ఆయన వ్యక్తిత్వం గురించి కొన్ని ఇంట్రెస్టింగ్ విషయాలను షేర్ చేసుకున్నారు. రీసెంట్ ఇంటర్వ్యూలో ఆమె పవన్ పొలిటికల్ వ్యక్తిత్వం గురించి తన మనసులో మాట చెప్పారు. పవన్ కళ్యాణ్ ఒక సింహం లాంటివారని, ఆయన చాలా ధైర్యవంతుడని కొనియాడారు. ఎవరికీ లేనంత తెగింపు ఆయన సొంతమని, ఏదైనా సమస్య వస్తే ఒంటరిగా పోరాడగల సత్తా ఆయనకు ఉందని ఆమె పేర్కొన్నారు. పవన్‌ను ఒక పవర్ ఫుల్ లీడర్‌గా చూస్తున్న నిధి, ఆయనలో ఉన్న ఆ ధైర్యమే ఆయన్ని ఈరోజు ఈ స్థాయిలో నిలబెట్టిందని వెల్లడించారు. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ భవిష్యత్తులో మన దేశానికి ప్రధాన మంత్రి అయినా తాను అస్సలు ఆశ్చర్యపోనని నిధి అగర్వాల్ ఒక షాకింగ్ స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఆయన ఎప్పటికైనా పీఎం రేంజ్ కు వెళ్తారని ఆమె బలంగా నమ్ముతున్నారు. ఎందుకంటే ఆయన ఇప్పటికిప్పుడు రాజకీయాల్లోకి రాలేదని, చాలా కాలంగా గ్రౌండ్ లెవల్‌లో ఎంతో కష్టపడుతున్నారని ఆమె గుర్తు చేశారు. ఆయన పట్టుదల చూస్తుంటే దేశ అత్యున్నత పదవికి అర్హుడని ఆమె అభిప్రాయపడ్డారు. ఇప్పుడు ఎన్నికల్లో గెలవడం వల్ల పవన్ పేరు దేశవ్యాప్తంగాఎక్కువగా వినిపిస్తోంది కానీ, ఆయన ఎప్పటి నుంచో తన టీమ్‌ని పార్టీని ఒక క్రమపద్ధతిలో నిర్మించుకుంటూ వస్తున్నారని నిధి వివరించారు. ఆయన విజన్ ఈరోజుది కాదని, ఏళ్ల తరబడి చేస్తున్న కృషికి ఇప్పుడు ఫలితం దక్కిందని ఆమె చెప్పుకొచ్చారు. ఎప్పుడూ ధైర్యంగా ఉంటూ, పది మంది కోసం నిలబడే గుణం పవన్‌ను ఒక గొప్ప నాయకుడిని చేసిందని ఆమె విశ్లేషించారు. పవన్ కళ్యాణ్ తో కలిసి పనిచేసిన అనుభవం గురించి చెబుతూ.. ఆయన వ్యక్తిత్వమే తనను ఎంతో ఆకట్టుకుందని నిధి అన్నారు. రాజకీయాల్లో ఇంత బిజీగా ఉండి కూడా పక్కా ప్లానింగ్‌తో ముందుకు వెళ్లడం ఆయనకే సాధ్యమని ప్రశంసించారు. ఇక నిధి అగర్వాల్ కెరీర్ విషయానికి వస్తే, ఆమెకు ఈ మధ్య కాలంలో టైమ్ అంతగా కలిసి రావడం లేదని చెప్పాలి. వీరమల్లు సినిమాతో పాటు ఈ సంక్రాంతికి ప్రభాస్‌తో కలిసి నటించిన ‘రాజాసాబ్’ కూడా బాక్సాఫీస్ వద్ద ఆమెకు ఆశించిన బ్రేక్ ఇవ్వలేకపోయాయి. వరుసగా రెండు భారీ ప్రాజెక్టులు చేసినా, అవి సక్సెస్ కాకపోవడం నిధి కెరీర్‌కు కొంత మైనస్ అనే చెప్పాలి. అయినప్పటికీ ఆమె మళ్ళీ బిజీ అయ్యేలా అడుగులు వేస్తోంది.

# ఘనంగా సుంకరి అల్వార్ దాస్ 23వ వర్ధంతి వేడుకలు









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియం నందు వాకర్స్ ఇంటర్ నేషనల్ ఫౌండర్ సుంకరి ఆళ్వార్ దాస్ 23వ వర్ధంతి 203 డిస్ట్రిక్ గవర్నర్ నలుబోలు బలరామయ్య నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నివాళి అర్పించారు. 1986లో వాకింగ్ అసోసియేషన్ స్థాపించి నప్పటి నుంచి ప్రజలందరూ వాకింగ్ చేసుకుంటూ ఆరోగ్యంగా ఉండాలని, ఆరోగ్యమైన సమాజాన్ని నిర్మించాలని ఆయన ఆశయం, ఆయన ఆశయాలను సాధిస్తాము అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్టేడియంలో ఉన్న అన్ని అసోసియేషన్‌లు వివేకానంద వాకర్స్/ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్/ఫ్రెండ్స్ వాకర్స్/స్మైల్ వాకర్స్/ఏ సి స్టేడియం మహిళా వాకర్స్ సభ్యులు వాకర్స్ ఇంటర్ నేషనల్ ప్రతినిధులు ఏకొల్లు రాఘవరెడ్డి, దాసరి అనంత రామారావు, పొన్నం రవిచంద్ర, డి వి సుబ్బరాజు, కె రఘురాం ముదిరాజ్, వేలూరు రంగారావు, ఎస్కే నసీర్ అహ్మద్,ఎస్కే అజ్మీర్ భాషా,ఎస్కే ఖమ్రుద్దీన్, కె మల్లెం కొండారెడ్డి పాల్గొని ఘనంగా ఆళ్వార్ దాస్‌కి నివాళులు అర్పించారు.

# గాంధీజీ పేరు తొలగింపు అనైతిక చర్య

## - గాంధీజీ ఆలోచనలు, పేదల హక్కులు రెండు మోడీకి నచ్చవు అందుకే పేరు మార్పు : గిడుగు రుద్రరాజు

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** దేశంలో రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్రలో భాగంగానే ఉపాధి హామీ పథకంలో మహాత్మాగాంధీ పేరును తొలగించారని కాంగ్రెస్ సీనియర్ నేత మాజీ పీసీసీ అధ్యక్షులు మరియు వర్కింగ్ కమిటీ (సి డబ్ల్యు సి) మెంబర్ గిడుగు రుద్రరాజు అన్నారు. మంగళవారం డీసీసీ కార్యాలయంలో డిసిసి అధ్యక్షులు హాసిని వర్మ ఆధ్వర్యంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ ఆలోచనా విధానాన్ని బీజేపీ అమలు చేస్తున్నదని ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్ర జరుగుతుందన్నారు. ఉపాధి హామీ పథకం మహాత్మాగాంధీ పేరుతో కాంగ్రెస్ పార్టీ చట్టంచేసి అమలు చేస్తే దానిని మార్చేశారని మండిపడ్డారు. పథకం నుంచి మహాత్మాగాంధీ పేరును తొలగించి, దానిని 'జీ రామ్ జీ'గా మార్చడం వెనుక ఉన్న రాజకీయ కుట్రను ప్రజలకు వివరించ డమే కాకుండా, రాష్ట్రాలపై కేంద్రం మోపుతున్న అదనపు ఆర్థిక భారంపై అవగాహన కల్పించాలని అధిష్ఠానం నిర్ణయించిందనీ దేశవ్యాప్తంగా ఆందోళనలు చేయడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని తెలిపారు. గాంధీజీ అంటే మోడీకి నచ్చదని గాంధీ ఆలోచనలు, పేదల హక్కులు రెండు మోడీకి నచ్చవని మోడీ ప్రభుత్వం గత పదేళ్లుగా ఈ పథకాన్ని బలహీన పరిచే కుట్రను చేస్తుందని తెలిపారు.100 రోజుల పని ఇప్పుడు 75 రోజులకు తగ్గిపోయిందన్నారు. కేం ద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం భరించాలని కండిషన్ పెట్టిందని, దీనిని బట్టి చూస్తే కేంద్రంపై భారం తగ్గించుకున్నట్లేనని అన్నారు.పనులు కూడా గ్రామానికి అనుకూలంగా కాకుండా కేంద్రం చెప్పిన పనులే చేయాల్సి ఉంటుందన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్ర కాంగ్రెస్ పార్టీ ఉన్నంత వరకు జరగని పని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి, పేదల పని హక్కును హరిస్తుందని ఆరోపించారు. ఉపాధి హామీ




చట్టాన్ని నిర్వీర్యం చేయడం ద్వారా పేదల జీవనాధారంపై దాడి చేస్తుందని విమర్శించారు. సోనియా గాంధీ నేతృత్వంలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ గ్రామీణ ప్రజలకు పని హక్కు కల్పించిన ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని, తద్వారా బడా పారిశ్రామికవేత్తలకు లబ్ధి చేకూర్చాలని కేంద్రం చూస్తోందని కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేశారు. ఇప్పటికైనా కేంద్రం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని లేదంటే మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ నేతృత్వంలో మరియు ఆంధ్ర రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిలమ్మ నాయకత్వంలో ఉద్యమిస్తాం అని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు హాసిని వర్మతో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ లక్కరాజు రామారావు, విశాఖ జిల్లా నియోజక వర్గ ఇంచార్జీలు కేవీ సూర్యనారాయణ, ప్రియాంక దండి, సవరవిల్లీ రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శులు గాదం మహేష్, రాష్ట్ర స్పోర్ట్ సెల్ చైర్మన్ కమలాకర్, రజియా బేగం, అబీద, ప్రధాన కార్యదర్శులు ఆనందకుమార్, రాజేష్, ఆర్గనైసింగ్ సెక్రటరీ గౌతం, సీనియర్ నాయకులు వజ్జిపర్తి శ్రీనివాస్, గుత్తుల శ్రీనివాస్, మహిళ ప్రెసిడెంట్ గాయత్రి, కస్తూరి వెంకటరావు, సోద సుధాకర్, తెడ్డు రామదాసు, జగన్ మురారి, కనకరావు, అప్పారావు, సేవాదళ్ నాయకులు, పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పారిశ్రామిక అవగాహనకు "ర్యాంప్"



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** విద్యార్థులు పారిశ్రామిక, వ్యాపార వేత్తల గురించి అవగాహన కలిగి ఉండాలని వైఆర్ఎల్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ వై. లావణ్య పిలుపునిచ్చారు. 'రైసింగ్ అండ్ ఆక్సిల రేటింగ్ ఎంఎస్ ఎంఈ పెర్ఫార్మెన్స్ (రాంప్) కార్యక్రమంలో భాగంగా 20 రోజుల ఎంటర్ప్రెన్యూర్షిప్ కమ్ స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాన్ని కళాశాలలో 60 మంది విద్యార్థులచే ప్రారంభించారు. ఈ సం దర్భంగా ప్రిన్సిపాల్ లావణ్య మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు నిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయ సహకారాలతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో ఎంటర్ప్రెన్యూర్షిప్ స్కిలు అభివృద్ధి చేసే దిశగా కార్యక్రమాన్ని రూపొందించి నట్లు ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఆసక్తిగా పలు విషయాలు నేర్చుకున్నారన్నారు. మరో రెండు రోజులలో తదుపరి బ్యాచ్‌ల శిక్షణ ప్రారంభం అవుతుందని, ఆసక్తి ఉన్న యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ లావణ్య తెలిపారు.

# దాతలు ముందుకు రావాలి

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు ప్రతి శనివారం నిర్వహించే ప్రత్యేక ప్రసాద వితరణకు గాను దాతలు ముందుకు రావాలని ఆలయ కార్య నిర్వహణ అధికారి కే జగదీశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెద్దాపురం పట్టణంలో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి అనేకమంది దాతలు ముందుకు వస్తున్నట్లు చెప్పారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ఇటీవల కొద్ది వారాలుగా ఆలయంలో ప్రతి శనివారం స్వామివారి దర్శనానికి విచ్చేసే భక్తులకు పులిహోర, చక్ర పొంగలి, దద్దోజనం వంటి ప్రసాదాలను అందించేందుకు ఆసక్తి గల దాతలుంటే ముందుకు రావాలన్నారు. ఆలయ ధర్మకర్తల మండలి సహకారంతో ఇప్పటికే ఆలయ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్టు ఆయన చెప్పారు. రానున్న రోజుల్లో ఆలయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి పరిచేందుకుగాను కృషి



చేస్తున్నందున దాతలు, పట్టణ నాయకులు తమ వంతు సహాయాన్ని సూచనలను అందించాలని ఆలయ అధికారి జగదీశ్వరరావు కోరారు. సహాయం అందించే దాతలు ఆలయంలో స్వయంగా గాని, 9160874474, 9849847412, 7842227743 నంబర్లలో సంప్రదించవచ్చునని ఆయన తెలిపారు.

# విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** విద్యార్థులు మత్తు పదార్థాలు, డ్రగ్స్, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి చదువుపై పూర్తి దృష్టి సారించాలని పి.ఎం. శ్రీ బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెడ్మాస్టర్ తోటకూర సాయిరామకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం పాఠశాల ప్రాంగణంలో హెడ్మాస్టర్ సాయి రామకృష్ణ ఆధ్వర్యంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో డ్రగ్స్, పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు "నో డ్రగ్ – నో టొబాకో" అంశంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు వివిధ నినాదాలతో కూడిన ప్లకార్డులు చేతబూని పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కే.జి.భవాని, బి. ఆర్.ఎస్. శివకుమార్, ఎన్. హరనాథ్, పి. బ్రహ్మానందం, వి. దుర్గాప్రసాద్, ప్రవీణ్, బాల శైలజ, పద్మావతి, సైదున్నిసా బేగం, శిరీష, నిర్మల, సి.హెచ్. లక్ష్మీ దుర్గ, బబిత బేబీ రాణి, జ్యోతి, యాదిద్య తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కి అభినందనలు తెలిపిన మత్స్యకార సంఘ సభ్యులు




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** గత ఏడాది (24-10-2025)న విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌కి చెందిన మత్స్యకారులు వేట నిమిత్తం బంగ్లాదేశ్ సముద్ర జలాలలో బంగ్లాదేశ్ కోస్ట్ గార్డ్ వారికి దొరికిన వారిని బంగ్లాదేశ్ జైల్లో పెట్టడం జరిగినది. నాటి నుండీ కూటమి ప్రభుత్వం నాయుకులు సహకారంతో వారి విడుదలకు అనేక రకాలుగా ప్రయత్నలు చెయ్యటంతో పాటు మత్స్యకారులు క్షేమంగా తిరిగి రావాలని అహర్నిశలు శ్రమించిన విశాఖ దక్షిణ నియోజకవర్గం శాసన సభ్యులు వంశీ కృష్ణ శ్రీనివాస్‌ని ఏపీ మేకనైజ్డ్ ఫిషింగ్ బోర్డ్ ఆపరేటర్ అసోసియేషన్ అధ్యక్షులు మైలపల్లి లక్ష్మణరావు మరియు 37వ వార్డ్ జనసేన పార్టీ అధ్యక్షులు మరియు మత్స్య కార నాయకులు గరికిన రవి సాలువాతో పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. రానున్న రోజుల్లో మత్స్యకారులకి ఎటువంటి సమస్యలు వచ్చిన ముందుండి పరిష్కారమయ్యేలా చేస్తాను అని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే వంశీ. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

# కరప మండలం జెడ్ భావారంలో వానర సేన బీభత్సం

## - ప్రజలకు తీవ్ర ఇబ్బందులు - అధికారుల జోక్యం కోరుతున్న గ్రామస్థులు





**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్, కరప మండలం జెడ్ భావారం గ్రామ ప్రజలు వానర సేన ప్రవర్తనలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో కోతుల దండు రోజురోజుకీ పెరిగి ఇళ్లలోకి చొరబడి సామాన్లు పాడు చేయడం, పెంకుడిల్లుల పైకొప్పులు తీసి పడవేయడం, ఇళ్లపై ఉన్న కరెంటు పైపులను పట్టుకుని ఊపివెళ్లడం వంటి చర్యలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఇంటికి తెచ్చు కున్న కిరాణా సామాన్లను లాక్కుని వెళ్లిపోవడం, చిన్న పిల్లల చేతుల్లో ఉన్న తినుబండారాలను లాక్కొని వారిపై దాడి చేసి గాయాలు కలిగించడం వంటి ఘటనలు కూడా జరుగుతున్నట్లు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటనలు దాదాపు రోజువారీగా జరుగుతుండటంతో గ్రామ ప్రజల సాధారణ జీవితం తీవ్రంగా దెబ్బతింటోంది. వానరాల బెడదతో పిల్లలు, వృద్ధులు, మహిళలు బయటకు రావాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు, జిల్లా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకుని వానరాల నుండి తమను రక్షించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సమస్యకు తక్షణమే పరిష్కారం కనుగొని ప్రజలకు భద్రత కల్పించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని గ్రామవాసులు కోరుతున్నారు.



# పార్టీ సంస్థాగత నిర్మాణం చేపట్టాలి

## - ప్రతి గ్రామంలో అనుబంధ విభాగాల కమిటీలను నియమించాలి
## - వచ్చే ఎన్నికలలో పార్టీని విజయపథం వైపు నడిపించాలి - జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలి





**అమలాపురం, (రాజధాని వార్తలు):** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణానికి ప్రతి గ్రామంలో అనుబంధం కమిటీలను నియమించి పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్య కర్త కృషి చేయాలని అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. జిల్లా అధ్యక్షులు జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం అమలాపురంలోని వాసర్ల గార్డెన్స్‌లో అంబేద్కర్ కోనసీమ జిల్లా పార్టీ సంస్థాగత నిర్మాణ (వర్క్ షాప్) సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు జక్కంపూడి రాజా, రాష్ట్ర అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్, అమలాపురం పార్లమెంట్ పరిశీల కులు జక్కంపూడి విజయలక్ష్మి పాల్గొన్నారు. వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామ స్థాయి నుండి అనుబంధ కమిటీలను నియమించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. ప్రతి గ్రామంలో ఏడు అనుబంధం విభాగాలను తప్పనిసరిగా నియ మించాలని సమావేశంలో పార్టీ నేత లకు దిశ నిర్దేశం చేశారు. 25వ తేదీ నాటికి అనుబంధ కమిటీల నియామకం పూర్తి చేయాలన్నారు. అబ్జర్వర్‌ల సహకారంతో కమిటీల నియామకం పూర్తి చేయాలన్నారు. జిల్లా, మండల, గ్రామ కమిటీలను నియమించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

పాల్గొన్న ఇతర ప్రముఖులు:

రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, మాజీ ఎంపీ చింతా అనురాధ, ఎంఎల్సీలు బొమ్మి ఇశ్రాయేల్, కుడుపూడి సూర్య నారాయణ రావు, జెడ్పి చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షులు జిన్నూరి బాబీ,అమలాపురం అసెంబ్లీ ఇంచార్జ డాక్టర్ పినిపే శ్రీకాంత్, ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్, రామచంద్రాపురం అసెంబ్లీ ఇంచార్జ్ పిల్లి సూర్యప్రకాశ్, రాష్ట్ర కార్యదర్శులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, వంటెద్దు వెంకన్నాయుడు, ఎస్ఇసి మెంబర్ కుడుపూడి బాబు, పి గన్నవరం కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరి, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో గజమాల యాత్రను విజయవంతం చేయండి

## - అధికారులు, అగ్నికుల క్షత్రియ నాయకులతో సమీక్ష నిర్వహించిన ఆర్డిఓ కె.మాధవి





**అమలాపురం, (రాజధాని వార్తలు):** అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి కళ్యాణ మహోత్సవం సందర్భంగా స్వామివారి ఆలయ నిర్మాత భక్త శిఖామణి కోపనాతి కృష్ణమ్మకి సమ ర్పించు 16వ అగ్నికుల క్షత్రియుల అంతర్వేది మహా గజమాలయాత్ర ప్రశాంత వాతావరణంలో విజయ వంతంగా నిర్వహించాలని ఆర్డీవో కే మాధవి అన్నారు. గజమాల కమిటీ, పోలీసులు సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో ఈ గజమాల యాత్రను నిర్వహించాలని ఆర్డీవో సూచించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఆర్డిఓ కార్యాలయంలో మంగళవారం గజమాల కమిటీ సభ్యులు, పోలీస్ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించి ఈనెల 28వ తేదీ కళ్యాణ మహోత్సవం రోజున నిర్వహించే మహా గజమాల యాత్ర నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీ స్వామివారి భక్త శిఖామణి కోపనాతి కృష్ణమ్మ స్వగ్రామం అల్లవరం మండలం ఓడలరేవు నుండి పేరూరు వై జంక్షన్ మీదుగా అంతర్వేది ఆలయం వరకు జరిగే అగ్నికుల క్షత్రియ మహాగజమాల యాత్రకు ఇరు రాష్ట్రాల నుండి అగ్నికుల క్షత్రియ నాయకులు తరలి వస్తారన్నారు. ఈ గజమాల యాత్రలో హైందవ ధర్మ అగ్నికుల క్షత్రియ భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని అగ్నికుల క్షత్రియ అంతర్వేది మహా గజమాల యాత్రను విజయవంతం చేయా లని ఆమె సూచించారు. సమయపాలన పాటిస్తూ ఓడలరేవు నుండి ఉదయం 8 గంటలకు గజమాల యాత్ర ర్యాలీ ప్రారంభమై సాయంత్రం 6 గంటలకు అంతర్వేది లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి చేరుకుని కమిటీ సభ్యులు, వ్యవస్థాపకులు పట్టు వస్త్రాలు సమర్పించి పూజాధి కార్యక్రమాలు నిర్వహిస్తార న్నారు. గజమాల యాత్ర ర్యాలీ నిర్వహించే దారి పొడవున మద్యం షాపులు మూసి వేయాలని, బైకులు సైలెన్సర్లు తీసి ద్విచక్ర వాహనాలు నడుపుతూ సౌండ్ పొల్యూషన్ సృష్టించరాదని, మద్యం సేవించి ర్యాలీలో పాల్గొనరాదని ఆమె స్పష్టం చేశారు. గజమాల సమర్పించిన అనంతరం కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు సేకరించాలన్నారు. దారి పొడవునా ర్యాలీలో ఆయా గ్రామాల పెద్దలు పాల్గొంటారని ఆమె స్పష్టం చేశారు. అంతర్వేది ఆలయం వద్ద రెవెన్యూ అతిథిగృహం వరకు గజమాల ర్యాలీ నిర్వహించాలని సూచించారు. పూర్తి సమన్వయంతో మహా గజమాల యాత్రను విజయవంతం చేయాలని ఆమె కమిటీ పెద్దలు, పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి టి ఎస్ ఆర్ కె ప్రసాద్, గజమాల కమిటీ పెద్దలు చింతామహారాజు నాగే శ్వరరావు, కొల్లు శ్రీనివాసరావు, వెంకట రామరాజు, భీమరాజు పాల్గొన్నారు.

# జల వివాద సమస్యను పార్లమెంటులో ప్రస్తావిస్తా : తిరుపతి ఎంపీ



**తిరుపతి, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లా పులికాట్ ప్రాంతంలో కొనసాగుతున్న అంతర్రాష్ట్ర జల వివాదం సమస్య గురించి స్థానిక మత్స్యకారులు తిరుపతి ఎంపీ గురుమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలోని సుమారు 24 గ్రామాల మత్స్యకారులకు పులికాట్ సరస్సు, దాని పరిసర తీర ప్రాంతాల్లో చేపల వేటే ప్రధాన జీవనాధారమని, అందులో ఐదు గ్రామాలు పూర్తిగా మత్స్య వృత్తిపైనే ఆధారపడి ఉన్నాయని వారు ఎంపీకి వివరించారు. పన్నంగాడు ప్రాంతంలో ఉన్న పులికాట్ సరస్సు పబ్లిక్ పులికాట్ మ్యాప్స్ ప్రకారం పూర్తిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిధిలోనే ఉందని, ఈ ప్రాంతం అంతర్రాష్ట్ర సరిహద్దుకు సుమారు 3.34 కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ తమిళనాడు రాష్ట్రానికి చెందిన మత్స్యకారులు సరిహ ద్దులు మార్చేశారని అందువలన చేపల వేట కొనసాగించడం సమస్యగా మారిందని మత్స్యకారులు తెలిపారు. దీనివల్ల తరచు ఘర్షణలు చోటు చేసుకుంటూ, స్థానిక మత్స్యకారులు భయభ్రాం తులకు గురవుతూ జీవనాధారం కోల్పోయే పరిస్థితి నెలకొందని ఎంపీకి తెలియజేశారు. ఈ అంశం గురించి వారితో మాట్లాడిన ఎంపీ ఈ సమస్య గురించి గతంలో పార్లమెంటు సమావేశాలలో మాట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ విషయమై మరోసారి పార్లమెంటులో ప్రస్తావిస్తానని వారికి తెలిపారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడిన ఎంపీ గురుమూర్తి అక్రమ చొరబాట్లను అరికట్టి స్థానిక మత్స్యకారులకు రక్షణ కల్పించాలని, వారి సంప్రదాయ మత్స్యకార హక్కులను కాపాడేలా శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

# మీడియా ప్రోత్సాహంతోనే రాజకీయాల్లో రాణిస్తున్నా



**నాయుడుపేట, (రాజధాని వార్తలు):** తాను రాజకీయాల్లోకి వచ్చిన తరువాత విలేకరుల ప్రోత్సాహంతోనే రాణిస్తున్నట్లు సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం నాయుడుపేట పట్టణంలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో జరిగిన సూళ్లూరుపేట నియోజకవర్గ మీడియా ప్రతినిధుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే విజయశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను రాజకీయాల్లోకి వచ్చినప్పుడు సమాజంలో జరిగే ప్రతి విషయం గురించి మీడియాలో ప్రచురిస్తారని, ప్రతి విషయంపై ప్రజలకు సమాధానం ఇవ్వగలసిన అవసరం ఉందని, ఈ క్రమంలో మీడియా ప్రతినిధుల రాజకీయ వేధింపులకు గురి చేస్తారన్న అభిప్రాయం ఉండేదని అన్నారు. అయితే తాను రాజకీయాల్లోకి కొత్త అయినప్పటికీ విలేకరుల తనను తాను సోదరిగా ప్రోత్సాహించడంతో ఎలాంటి పొరబాటులకు తావు లేకుండా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానని తెలిపారు. మీడియా సహకారం మరువలేనిదని కొనియాడారు. అలాగే మీడియా సోదరులు అందిస్తున్న మద్దతు తనకు ఎంతో ధైర్యాన్ని ఇస్తోందన్నారు నియోజకవర్గ అభివృద్ధిలో మీడియా పాత్ర కీలకమని, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో పాత్రికేయులు వారధిలా పని చేస్తున్నారని ఆమె కితాబు ఇచ్చారు. 2024 ఎన్నికల సమయం లో మీడియా మిత్రులు నాకు అన్నదమ్ముల్లా అండగా నిలిచారని తెలిపారు. తన తల్లిదండ్రులు తనకు కుళ్ళు కుతంత్రాలు నేర్పలేదని, ప్రజలకు మంచి చేయాలనే సంకల్పంతోనే రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు. నియోజకవర్గ ప్రజలు నేరుగా తనకు మెసేజ్‌లు, ఫోటోలు పంపి వారి సమస్యలను వివరిస్తున్నారని తెలిపారు. ప్రతి సమస్యను పరిష్కరించి, బాధ్యతాయుతంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. నియో కవర్గంలో అర్హులైన ప్రతి విలేకరికి ఇళ్ల స్థలం వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని అన్నారు. ఈ విషయం గురించి ఇప్పటికే తిరుపతి జిల్లా కలెక్టర్‌తో చర్చించానని తెలిపారు. సూళ్లూరుపేట నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే ఎంపి నిధులు లేకపోయినా మంత్రులు, లక్ష్యంగా జిల్లా కలెక్టర్, ముఖ్యమంత్రులను కలిసి ప్రత్యేక నిధులు తీసుకు వస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న మీడియా వాస్తవాలను ప్రచురించాలన్నారు. ఇటీవల ఓ మీడియాలో ఒక అవాస్తవంతో కూడిన కథనాలు వచ్చాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మీడియా ప్రతినిధుల ఒక వ్యక్తిని పైకి తీసుకురాగరని, అలాగే పాతాళంలోకి నెట్టేయగలరని అన్నారు. నియోజకవర్గ ప్రజా సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చి, అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, సూళ్లూరుపేట ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, నాయుడు పేట శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు, చిల్లకూరు పిఎసిఎస్ డైరెక్టర్ పెళ్ళకూరు గోపాలకృష్ణ, ఓజిలి, పెళ్ళకూరు, సూళ్లూరుపేట మండలాల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు విజయకుమార్ నాయుడు, సంచి కృష్ణయ్య, కొక్కు శంకరయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు, టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పసల గంగా ప్రసాద్, తిరుపతి పార్లమెంటు మహిళా ఉపాధ్యక్షురాలు చెందేటి సుజాత, ఓజిలి మండలం నాయకులు కంకణాల సత్యవరప్రసాద్ నాయుడు, దాసరి నిరంజన్, ఎం.శ్రీనివాసులు, పాడి.వెంకట సుబ్బయ్య, దువ్వూరు శ్రీనివాసులు రెడ్డి, గున్నంరెడ్డి మధుసూదన్ రెడ్డి తెలుగుదేశం పార్టీ నాయకులు, నియోజకవర్గంలోని వివిధ ప్రింట్ ఎలక్ట్రానిక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మానసిక, శారీరక వికాసానికి క్రీడలు ప్రధానం



**గూడూరు, (రాజధాని వార్తలు):** గూడూరు నియోజకవర్గ పరిధిలో యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహించిన యూత్ టోర్నమెంట్‌లో ఓడూరు తీపనూరు ఆర్గనైజ్ టీం ఘన విజయాన్ని సాధించింది. ఈ సందర్భంగా లైవ్ స్టాక్ డైరెక్టర్ గుండాల లీలావతి మాట్లాడుతూ, యువతను క్రీడల వైపు ప్రోత్సహించడమే ఈ టోర్నమెంట్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. యువత శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవ్వాలంటే ఇలాంటి క్రీడా పోటీలు ఎంతో అవసరమని ఆమె అన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొన్న అన్ని టీమ్‌లు ఎంతో ఉత్సాహంగా, క్రీడా స్ఫూర్తితో పోటీ పడ్డాయని ప్రశంసించారు. గెలుపు – ఓటమి కన్నా, పాల్గొనడమే ముఖ్యమని, క్రీడలు స్నేహభావాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే సునీల్ కుమార్, తానంకి నానాజీల ఆశీస్సులతో యూత్ టోర్నమెంట్‌ను నిర్వహించామన్నారు. ఈ పోటీలలో ఓడూరు తీపనూరు ఆర్గనైజ్ టీమ్ విజేతగా నిలవడం ఎంతో ఆనందకరమైన విషయం అని తెలిపారు. విజేత టీమ్‌కు టోర్నమెంట్‌కు సహాయ సహకారాలు అందించి ముఖ్య అతిధిగ్గా హాజరైన ఘంటా మధు కృష్ణ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. గెలుపొందిన టీమ్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఇంకా మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని స్నేహపూర్వక వాతావరణంలో యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించడమే లక్ష్యంగా ఇలాంటి టోర్నమెంట్లు నిర్వహిస్థానమని చెప్పారు. ఈ కార్యక్రమాలకు ప్రతి సంవత్సరం కూడా పెన్వర్ డైరెక్టర్ ఘంటా మధు కృష్ణ నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా ఘంటా మధు కృష్ణ తన కంపెనీ ద్వారా ఎంతోమంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న వ్యక్తిగా ప్రత్యేకంగా ప్రశంసించారు.యువత భవిష్యత్తు కోసం ఆయన చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిల్లకూరు మండల టీడీపీ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, జానకి రామిరెడ్డి, నాయకులు, చిరంజీవి, కీరవాణి, అర్చన, రామచంద్రారావు, మోమిడి వెంకట కృష్ణయ్య, లీలా కుమార్, ప్రవీణ్ రెడ్డి, పచ్చ వెంకటేశ్వర్లు నాయుడు, ఓడూరు సతీష్ రెడ్డి, బల్లవోలు యశ్వంత్ పసల వెంకటేశ్వర్లు, మేకల కుమార్, బొమ్మెళ్ళ త్రివిక్రమ్ దార రవి, పల్లమాల అనిల్, సురేంద్ర గారా అశోక్, పారిశ్రామిక వేత్తలు, క్రీడాకారులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఆరోగ్యవంతమైన సమాజం మహిళల ద్వారానే సాధ్యం




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఆరోగ్యవంతమైన సమాజం మహిళల ద్వారానే సాధ్యమని, కనుకనే విద్యార్థినులు చిన్న వయస్సు నుంచే వివిధ రకాల వ్యాధులపై అవగాహన కలిగిఉండటం అత్యం త అవసరమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అన్నారు. ఈ నెల 1 నుండి 31 వరకు జరుగుతున్నటువంటి గర్భాశయ ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం నగరంలోని డి కె డబ్ల్యూ మహిళా కళాశాలలో కిమ్స్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో హెచ్ పి వి టీకా కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయని, సరైన అవగాహన, సమయానికి తీసుకునే టీకాలు, నిత్య ఆరోగ్య పరీక్షల ద్వారా ఈ వ్యాధులను పూర్తిగా నివారించవచ్చునని తెలిపారు. విద్యార్థినులు చిన్న వయస్సు నుంచే తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం అవసరమన్నారు. హెచ్.పి.వి. టీకా గర్భాశయ క్యాన్సర్ నివారణలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం, తద్వారా సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కిమ్స్ హాస్పిటల్‌లాంటి సంస్థలు మహిళల ఆరోగ్య పరిరక్షణకు ముందడుగు వేయడం అభినందనీయమన్నారు. సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ టి.జి.లక్ష్మీ దుర్గ, డాక్టర్ మోహన సాయిరూప మహిళలు ఎదుర్కొంటునటువంటి ఆరోగ్య సమస్యల గురించి వాటిని నివారించుటకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి, నూతన వైద్య విధానాలు మరియు టీకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ రోహిణి ప్రియ లక్ష్మి, డి కె డబ్ల్యూ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమణా రెడ్డి, ఆర్.ఐ.ఓ. టి. వర ప్రసాద్, డి.వి.ఇ.ఓ. బి.వి.కృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- , అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# 50% డిస్కౌంట్‌తోనే మొదలయ్యే ఏకైక ప్లాట్‌ఫారమ్



**వేణు జి సోమినేని, వ్యవస్థాపకుడు**



**తిరుమలరావు చామళ్ల, సహ వ్యవస్థాపకుడు**

HalfPe.com ఒక చిన్న కానీ బలమైన ఆలోచనతో పుట్టింది. భారతదేశం ప్రతి మూలలోనూ మంచి జీవితం కోసం కలలు కనే కుటుంబాలు ఉన్నాయి. అలాగే, అమ్ముడుపోని స్టాక్‌తో ఇబ్బంది పడుతున్న వ్యాపారులు కూడా ఉన్నారు. మధ్యతరగతి కుటుంబం ప్రతి రూపాయిని లెక్కపెట్టి ఖర్చు చేస్తుంది– మంచి క్వాలిటీ తక్కువ ధరలో దొరకాలనే ఆశతో. అదే సమయంలో బెంగళూరు, సూరత్, ఢిల్లీ, కోయంబత్తూర్ లాంటి నగరాల్లో ఉన్న వ్యాపారుల గోదాముల్లో మంచి ప్రొడక్ట్స్ అమ్ముడుపోకుండా నిల్వగా ఉన్నాయి. ఈ రెండు మధ్య ఉన్న గ్యాప్‌ని మేము సమస్యగా కాదు – ఒక అవకాశంగా చూశాం. ఆశలకూ, అందుబాటుకీ మధ్య ఒక బ్రిడ్జ్ కట్టాలని నిర్ణయించాం. ఎక్కువ స్టాక్ ఉన్న చోటు నుంచి ఎక్కువ అవసరం ఉన్న చోటుకి సరైన మార్గం చూపాలని భావించాం.

ఫౌండర్: వేణు జి సోమినేని,
కో–ఫౌండర్: తిరుమలరావు చామళ్ల

మేము ఒక ప్లాట్‌ఫారమ్‌ని ఊహించాం – బెంగళూరులో warehouse లో అమ్ముడుపోకుండా ఉన్న ఒక ప్రొడక్ట్, పట్నా లేదా మదురైలో ఉన్న ఒక కుటుంబానికి చేరేలా. దూరం అడ్డంకి కాకుండా, డిమాండ్ దేశం అంతా స్వేచ్ఛగా ప్రయాణించేలా. ఇండియాలో 30,000 మందికి పైగా డెలివరీ టీమ్ ఉన్న బలమైన నెట్‌వర్క్‌తో, HalfPe.com నేరుగా సెల్లర్ల గోదాముల నుంచే సరుకులు తీసుకుని దేశమంతా ఇళ్లకు చేరుస్తుంది. HalfPe.లో ప్రతి ప్రొడక్ట్ కనీసం 50% డిస్కౌంట్‌తోనే మొదల వుతుంది – నిజమైన సేవింగ్స్, నిజమైన విలువ, ప్రతిరోజూ. ఎందుకంటే మేము నమ్మేది ఒక్కటే – మంచి క్వాలిటీ లగ్జరీగా ఉండకూడదు. గౌరవంగా జీవించడం ఖరీదైనదిగా ఉండకూ దదు. HalfPe.com కేవలం ఒక ఈ–కామర్స్ ప్లాట్‌ఫారమ్ కాదు. ఇది న్యాయం, అవకాశం, నమ్మకం మీద నిర్మించిన ఒక జాతీయ ఉద్యమం. మేము వ్యాపారులకు warehouse lo ఆగిపోయిన డబ్బును తిరిగి పని చేసేలా చేస్తాం. అమ్ము డుపోని స్టాక్‌ని కొత్త వృద్ధిగా మార్చేలా సహాయం చేస్తాం. మధ్య తరగతి కుటుంబాలకు బడ్జెట్ దాటకుండా మంచి ప్రొడక్ట్స్ ఇంటికి చేరేలా చేస్తాం. మేము కేవలం సరుకులు తరలించం – మేము కలలను తరలిస్తాం. జీవికలను బలపరుస్తాం. కొత్త అవకాశాలకు దారి చూపుతాం. HalfPe.com అంటే – భారతదేశం యొక్క స్మార్ట్ సెల్లర్లు భారతదేశం యొక్క స్మార్ట్ సేవర్స్‌ను కలిసే చోటు. ప్రతి రూపాయికి నిజమైన విలువ దొరికే marketplace - HalfPe.com.

# రంగోత్సవ్ జిల్లా స్థాయి పోటీలలో జివికె చిన్మయ విద్యాలయ విద్యార్థుల ప్రభంజనం



**ఇందుకూరుపేట, కొత్తూరు, (రాజధాని వార్తలు):** స్థానిక పల్లిపాడు డైట్ కళాశాలలో నిర్వహించిన 'రంగోత్సవ్ 2025–26' జిల్లా స్థాయి కళల పోటీలలో జివికె చిన్మయ విద్యాలయ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను కనబరిచి పలు బహుమతులను కైవసం చేసుకున్నారు. విద్యార్థులు లలిత కళల నుండి ప్రదర్శన కళల వరకు వివిధ విభాగాలలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి విద్యాలయానికి గర్వకారణంగా నిలిచారు.

విజేతల వివరాలు:

ప్రథమ బహుమతి (రాష్ట్ర స్థాయికి ఎంపిక): చిత్రలేఖనం విభాగంలో 8వ తరగతి విద్యార్థి అయిన డి.యస్విత ప్రథమ బహుమతి సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది.

ద్వితీయ బహుమతి: చేతిరాత విభాగంలో 8వ తరగతి విద్యార్థులైన కె.వినుత్న, రంగోలి పోటీలలో పల్లవి, చైత్ర వర్ధన్, తరిణి బృందం, అలాగే 7వ తరగతి విద్యార్థులైన జానపద నృత్యంలో నిత్య, మహియ, ఆశ్రిత, సుజీవని, పూర్ణిమ బృందం ద్వితీయ స్థానాలను దక్కించుకున్నారు.

తృతీయ బహుమతి: పాత్రికాభినయం విభాగంలో 8వ తరగతి విద్యార్థులైన జె.సాయి చేతన్, ఎ.శంకర విహారి, కె. జక్షిత్ వల్లభ్ తృతీయ బహుమతులను గెలుచుకున్నారు.

యాజమాన్యం అభినందనలు:

ఈ సందర్భంగా విద్యాలయ కరెస్పాండెంట్ బద్దెపూడి హరిత మరియు యాజమాన్యం మాట్లాడుతూ.. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి రంగోత్సవ్ వంటి వేదికలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. విజేతలకు, వారికి శిక్షణనిచ్చిన ఉపాధ్యాయులకు మరియు ప్రోత్సహించిన తల్లిదండ్రులకు తమ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన యస్వితకు ప్రత్యేక శుభాకాంక్షలు అందజేశారు.

# అపాచీ కంపెనీలో యువకుడు ఆత్మహత్య

**తడ, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లా తడ మండలంలోని మాంబట్టు సెజ్ అపాచీ పరిశ్రమంలో మంగళవారం సాయంత్రం సమయంలో పరిశ్రమలో పనిచేసే కార్మికుడు బాత్రూంలో ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. వివరాల ప్రకారం మృతుడు పేరు దార్ల యుగంధర్ (41) నాయుడుపేట మండలం గొట్టిప్రోలు తనమాల గ్రామానికికి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. బాత్రూంలోకి తోటి కార్మికులు వెళ్లగా వేలాడుతున్న మృతదేహం చూసి భయభ్రాంతులకు గురైన కార్మికులు కంపెనీ యాజమాన్యానికి తెలపగా యాజమాన్యం తడ పోలీస్ స్టేషన్ తెలియజేయగా తడ ఎస్సై ఘటన స్థలానికి చేరుకొని బాడీని సూళ్లూరుపేట ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించి కేసు నమోదు చేశారు. మృత్యుకు గల కారణాలు తెలియాల్సి ఉంది.



**అమరావతి సచివాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడుతున్న రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు మరియు గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారథి.**

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan